# ప్రజాశక్తి

సోమవారం 13 ఫిబ్రవరి 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల




గుండ్లకమ్మ రిజర్వాయర్ (ఫైల్)

### గుండ్లకమ్మ నదిలో పూడికతీత ద్వారా

## ఇసుక తవ్వకాలకు అనుమతులు

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

గుండ్లకమ్మ నది నుంచి ఇసుకను తరలిండచం వద్ల రిజర్వాయర్‌కు నష్టం వాటిల్లుతుందని పర్యావరణ వేత్తలు, నిపుణులు చెబుతున్నారు. అయినప్పటికీ గుండ్లకమ్మ నదిలో పూడికతీత ద్వారా ఇసుక తవ్వకాలకు (డి సిల్టేషన్) జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఆమోదముద్ర వేసింది. బాపట్ల జిల్లాలోని వాగులు, వంకల్లో ఇసుక లభ్యతపై జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఇటీవల సమావేశమైంది. ఈ సమావేశంలో ఇసుక రేవులు, ఇసుక తవ్వకాలపై చర్చించారు. ప్రజా అవసరాలకు తగినట్టుగా గుండ్లకమ్మ నదిలో ఇసుక లభ్యత వుందని తేల్చారు. నిబంధనల ప్రకారం గుర్తించిన ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు వివిధ శాఖల అధికారులు పరిశీలించి సమర్పించిన నివేదికపై చర్చించారు. అధికారుల నివేదిక ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలనను సరించి గుండ్లకమ్మ నదిలో డి సిల్టేషన్ ద్వారా ఇసుక తవ్వడానికి ఆమోదం తెలిపారు. ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించారు. బాపట్ల జిల్లా గుండ్లకమ్మ నదిలో 6.54 చదరపు కిలోమీటర్ల పరిధిలో పూడికతీత ద్వారా ఇసుక తవ్వడానికి అవకాశం ఉందని, ఆ ప్రాంతంలో 2,95,072 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వడానికి అధికారికంగా ఆమోదం తెలిపారు. జిల్లాలోని ప్రజా అవసరాలకు ఈ ఇసుక అందుబాటులోకి

▶ 2లో

## అధికారులు లేకుండానే గడప గడపకూ..

- ఎన్నికల కోడ్‌తో అధికారులు దూరం
- జనం సమస్యల పరిష్కారానికి తగ్గుతోన్న ప్రాధాన్యత
- రాజకీయ విమర్శలకు దూకుడు పెంచిన పాలకపక్ష నేతలు



గడప గడపకూలో మంత్రి సురేష్ (ఫైల్)

**ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో**

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు లోకి రావడంతో గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమానికి అధికార యంత్రాంగం దూరమైంది. దీంతో మంత్రి, ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులు కేవలం వాలంటీర్లను వెంట బెట్టుకుని గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమాన్ని నెట్టకొస్తున్నారు. మంత్రి ఆదిమూలపు సురేష్ రెండు రోజులుగా ఇదే తంతు సాగిస్తున్నారు. ఆయన వెంట అధికారులు ఎవరూ లేరు. మిగతా నియోజకవర్గాల్లోనూ ఎమ్మెల్యేలదీ ఇదే పరిస్థితి. ఇప్పటి వరకూ సచివాలయ సిబ్బంది మొత్తం ఇదే పనిలో నేతల వెంట ఉన్నారు. లబ్ధిదారులకు అందించే పథకాల బ్రోచర్లను పట్టుకుని ఇంటింటికీ తిరిగేవాళ్లు. ఇపుడా పరిస్థితి లేదు. ఎమ్మెల్యే ఒక ఇంటి నుంచీ మరో ఇంటికి చేరేలోపే సచివాలయ సిబ్బంది ఆ ఇంటి వద్ద ఉంటారు. ఎమ్మెల్యే రాగానే ఆయన చేతికి బ్రోచర్ ఇస్తారు. ఆయన దాన్ని చూసి లబ్ధిదారులకు ఇచ్చి ఏమైనా సమస్యలున్నాయా? మీకు ప్రభుత్వం నుంచి ఇంత లబ్ధి వచ్చిందని చెప్పి వెళుతుంటారు. ఇపుడు సచివాలయ సిబ్బంది చేసేపనంతా వాలంటీర్లే చేస్తున్నారు. జనం చెప్పే సమస్యలపై ఆయాశాఖల పరిధిలో ఉండే సిబ్బందికి చెబుతారు. వెంటనే పరిష్కారాలు చూడాలని అక్కడే ఆదేశిస్తున్నారు. అన్ని శాఖల అధికారులు కూడా ఎమ్మెల్యే వెంట ఉంటున్నారు. గ్రామాల్లోనైతే తహశీల్దార్లు, ఎంపిడిఒలు, దిగువస్థాయి అధికారులు అందరూ పాల్గొంటున్నారు. కలెక్టర్‌కూ నెలలో కనీసం ఒకటీ రెండు సార్లు గడపగడపకూ వెళ్లాలని నిర్దేశించారు. మొదట్లో వెళ్లారు. తర్వాత తగ్గించారు. ఏదేమైనా ఇపుడు పాలకపక్ష నేతలు గడపగడపకూ కార్యక్రమంలో అధికారులు లేకపోవడంతో దాని ప్రాధాన్యత తగ్గింది. పాలకపక్షనేతల రాజకీయ పర్యటనలుగా మారాయి. ఇక అవకాశం దొరికితే రాజకీయ విమర్శలు దిగుతున్నారు. ఎన్నికల ప్రచారం మాదిరిగా మారిపోతోంది. శనివారం మంత్రి ఆదిమూలపు సురేష్ గడపగడపకూ కార్యక్రమంలో చంద్రబాబుపై ధ్వజమెత్తారు. వెలుగొండ ప్రాజెక్టుపై చంద్రబాబు నిర్లక్ష్యంపైనా

▶ 2లో

## అమ్మో పెద్దపులి..!

- 20 రోజులుగా నల్లమల సరిహద్దు గ్రామాల్లో పులుల సంచారం
- భయాందోళనలో ప్రజలు
- మృత్యువాత పడుతున్న జీవాలు



పెద్దపులి పాదముద్రలు సేకరిస్తున్న ఫారెస్టు సిబ్బంది

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

నల్లమల సమీప గ్రామాల ప్రజలు పెద్ద పులుల సంచారంతో హడలిపోతున్నారు. మూడు వారాలుగా అటవీ లోతట్టు గ్రామాలకు పులులు వస్తుండడంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. అటవీ శాఖాధికారులు సేకరిస్తున్న పాదముద్రల ఆధారంగా పులులు బయటకు వస్తున్నట్లు తెలుస్తోంది. గత రెండు రోజుల క్రితం పుల్లలచెరువు మండలం అక్కపాలెం తాండా సమీపంలోని అటవీ ప్రాంతంలో పెద్దపులులు సంచరించాయి. అటవీ శాఖాధికారులు ఆ ప్రాంతంలో ఆడ, మగ పులులు పాదముద్రలు గుర్తించారు. వాటి జాడ కోసం ఆ ప్రాంతాల్లో కెమెరాలు ఏర్పాటు చేశారు. దోర్నాల మండలంలోని పెద్ద బొమ్మలాపురం సమీపం లోనూ పులి సంచరిస్తోంది. బూడేనాయక్ తాండాకు చెందిన కేతావత్ హనుమంతు నాయక్‌కు చెందిన ఆవును ఈ నెల 6న పులిదాడి చేసి చంపింది. యర్రగొండపాలెం మండలం కొలుకుల సమీపంలోని చెరువు వద్ద కొద్దిరోజులుగా పెద్దపులి సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పులుల సంచారాన్ని గుర్తిం చేందుకు అధికారులు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఓ పెద్దపులి ఎద్దు మృతదేహం వద్దకు వచ్చి కళేబరాన్ని తింటున్న దృశ్యం కెమెరాలో నిక్షిప్తమైంది. దీంతో స్పందించిన అటవీశాఖ పరిసర ప్రాంతాల్లోని రైతులు, ప్రజలను అప్రమత్తం చేశారు. నీటి కోసమే పులులు బయటకు వస్తున్నాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.



పెద్దపులి పాదముద్రలు

**దాహార్తి తీరకనే..**

వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ చిన్న పాటి చెక్ డ్యాంలు, నీటి తొట్టెలు, కుంటలు, సాసర్ పిట్సును నిర్మించాల్సి ఉంది. వేసవి కాలంలో మొబైల్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలి

▶ 2లో

### కెజిబివిల్లో పనిచేస్తున్న బోధనా సిబ్బందికి

## మినిమం టైం స్కేల్ ఇవ్వాలి

**పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి**



**ప్రజాశక్తి- అద్దంకి**

కెజిబివిల్లో పనిచేస్తున్న బోధనా సిబ్బందికి మినిమం టైంస్కేల్ ఇవ్వాలని పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లా అద్దంకిలో యుటిఎఫ్ ప్రథమ కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మీగడ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ కెజిబివిల్లో పనిచేస్తున్న బోధనా సిబ్బందికి అతి తక్కువ వేతాన్ని చెల్లిస్తున్నట్లు తెలిపారు. 2016 నుంచి వేతనాలు పెంచకుండా ఇప్పుడు కేవలం 23 శాతం పెంచుతున్నట్లు ప్రకటించడాన్ని తాము ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. 2016 నుంచి దేశంలో ,రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు 100 శాతం పెరిగినట్లు తెలిపారు. ఆ ధరలకు అనుగుణంగా జీతాలు పెంచకుండా 23 శాతం జీతాలు పెంచి ప్రభుత్వం గొప్పగా ప్రకటించుకోవడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఒప్పంద అధ్యాపకులు, ఉపాధ్యాయులు మినిమం టైం స్కేల్ తీసుకుంటున్నట్లు తెలిపారు. కస్తూరిబా గాంధీ విద్యాయాల్లో పనిచేసే సిఆర్‌టిల చేత సరైన అతి తక్కువ వేతనంతో వెట్టిచాకిరి చేయిస్తున్నట్లు తెలిపారు. ఇతర రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేసే కాంట్రాక్ట్‌లెక్చరర్లు, ఉపాధ్యాయులు, టిజిటిలకు రూ.44,570 రూపాయలు , పిజిటిలకు రూ.48,440, జూనియర్ అధ్యాపకులకు రూ.54,060 చెల్లిస్తున్నట్లు తెలిపారు. కెజిబివి పాఠశాల్లో పనిచేసే వారికి రూ.26,759,రూ.34,139, రూ.24,000 చెల్లిస్తామని ప్రకటించినట్లు తెలిపారు. ఇది అన్యాయమని తెలిపారు. కెజిబివి పాఠశాలకు రెగ్యూలర్ పోస్టులు కేటాయించాలన్నారు. రెగ్యులర్ టైం స్కేల్ ఇవ్వాలన్నారు. లేదంటే అప్పటి వరకు మినిమం టైం స్కేల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాత్రి పూట విధులు

▶ 2లో

## గుండ్లకమ్మ నదిలో పూడిక తీత ద్వారా ఇసుక తవ్వకాలకు అనుమతులు

(మొదటి పేజీ తరువాయి)

వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్యాకేజీ-2 వద్ద ఇసుక తవ్వడానికి జెపి వెంచర్స్ సంస్థకు అనుమతులు ఉన్నాయని, త్వరలోనే అక్కడ ఇసుక తవ్వకాలు మొదలవుతాయన్నారు. అదేవిధంగా జిల్లాలోని వాగులు, వంకల్లో ఇసుక తవ్వకాలకు కొత్తగా ఏడు ఇసుక రేవులను ఈ సమావేశంలో గుర్తించారు. అద్దంకి మండలంలోని వెంపరాల, నరసింహ పురం (గోపాలపురం), రామాయపాలెం, తిమ్మాయపాలెం, వేలమూరిపూడి, మోదేపల్లి గ్రామాలు, బల్లికురవ మండలంలోని వెలమవారిపాలెం గ్రామంలో ఇసుక రేవులను ప్రాథమికంగా గుర్తించినట్లు చెప్పారు. ఆ ప్రాంతంలో ఇసుక లభ్యత, ఇసుక తవ్వడానికి సాధ్యాసాధ్యాలపై సమగ్ర పరిశీలన చేసి స్పష్టమైన నివేదిక ఇవ్వాలని కమిటీలోని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం బాపట్ల జిల్లాలో ప్రజలకు అవసరమైనంత ఇసుక అందుబాటులోకి రానుందన్నారు. అనుమతులు లేని ప్రాంతాలలో ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణ పూర్తిగా అరికట్టాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. అనుమతులున్న రేవులలో చట్టబద్ధంగానే ఇసుక తవ్వకాలు జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## కెజిబివిల్లో పనిచేస్తున్న బోధనా సిబ్బందికి మినిమం టైం స్కేల్ ఇవాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించే టీచర్‌కు ప్రత్యేక గది కేటయించాలన్నారు. విద్యార్థినుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా వార్డెన్‌ను నియమించి రాత్రి బస భాద్యతల నుంచి సిఆర్‌టిలను తప్పించాలన్నారు. సిఆర్‌టిలకు నిర్ధిష్ట పనివేళలు ప్రకటించాలన్నారు. కొత్తగా ఇంటర్మీడియట్ ప్రవేశపెడుతున్న స్కూల్స్‌కు రెగ్యులర్ అధ్యాపకపోస్టులను కేటాయించాలన్నారు. ఇంటర్ బోధించే అధ్యాపకులకు జూనియర్ అధ్యాపకుల మినిమం టైం స్కేల్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశాడు. కెజిబివి సమస్యలపై 2006 నుంచి ఉద్యమ నాయకుడుగా తాను పని చేసినట్లు తెలిపారు. పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

## అధికారులు లేకుండానే గడపగడపకూ..

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడారు. అంతటితో ఆగకుండా చంద్రబాబుకు, టిడిపి సంబంధం లేదని ఆరోపించారు. వెన్నుపోటు పొడిచి పదవి చేపట్టారని విమర్శలు చేశారు. వాస్తవానికి గడపగడపకూ కార్యక్రమ ఉద్దేశం రాజకీయ విమర్శలు చేయడానికి కాదని చెబుతూనే ఇలాంటి ఆరోపణలు పెంచు తున్నారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు అమలు తీరును లబ్ధిదారులకు వివరించడం తోపాటు ఆయా వార్డులు, గ్రామాల్లో ఉన్న సమస్యలపై దృష్టి సారించాలి. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో మంచి ప్రచారం జరిగేలా చూడాలన్నది ఉద్దేశం. అంతేకాకుండా ఎమ్మెల్యేకు, జనానికి సజీవసంబంధాలు ఉండేలా చూడాలన్నది అధిష్టానం ఆలోచన. అయితే కార్యక్రమం అమలు విషయానికి వస్తే ఆచరణలోనే సమస్యగా మారింది. నెలకు 16 రోజులు తిరగాలనే నిర్ణయం అమలు చేయడానికి ఎమ్మెల్యేలు అవస్థలు పడు తున్నారు. సిఎం సమీక్ష చేస్తున్నారంటే హడావిడిగా తిరుగుతారు. తర్వాత నియోజక వర్గాలు వీడి ఎక్కడో వ్యాపారులు చేసుక ంటున్నారు. ప్రస్తుతం ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో కనిపించడం లేదు. ఇటీవల బాలినేని పట్టణంలో ఎక్కువ రోజులు పర్యటించారు. వీటితోపాటు పార్టీ బాధ్యతల్లోనూ కొందరున్నారు. ఇప్పటి వరకూ అధికారులను వెంటబెట్టుకుని గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యేలకు ఇపుడు ఎన్నికల కోడ్ రావడంతో ఒంటరిగానే తిరగాల్సి వస్తోంది. జనం చెప్పిన సమస్యలను ఆయాశాఖల అధికారులకు పంపుతున్నారు. వాటిని పరిశీలించాలని చెబుతున్నారు. పరిష్కారం ఏమేరకు ఉంటుందనేదీ చూడాలి. మార్చి 20 వరకూ ఎన్నికల కోడ్ ఉన్నందున అప్పటి వరకూ గడపగడపకూ ప్రభుత్వం అధికారుల్లే కుండానే సాగాల్సి ఉంది.

## అమ్మో పెద్దపులి..!

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతం చెక్ డ్యాంలు, సాసర్ పిట్లలో నీరులేక పోవటంతో పాటు చాలా ప్రాంతాల్లో చెరువులు, నీటి కుంటల్లో నీరు లేక అవి చాలా చోట్ల నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. నల్లమలలో భూగర్భ జలాలు అడుగంటడం, నీళ్లు దొరక్క పోవటంలో వన్యప్రాణులు దాహాన్ని తట్టుకోలేక సమీప గ్రామాలకు వస్తున్నాయి. ఈక్రమంలో జనావాసాల మధ్య సంచరించే సమయంలో వన్యప్రాణులు, పశువులపై దాడులకు తెగబడుతున్నాయి.

**పాలుట్లలో రైతుపై దాడి..**

ఇటీవల నల్లమల అభయారణ్యంలోని పాలుట్లలో పొలానికి వెళ్లి తిరిగి వస్తున్న రైతు బాలునాయక్‌పై పెద్దపులి దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. గతంలో పెద్దపులులు మనుషుల మీద దాడి చేసిన సంఘటనలు ఎక్కడా చోటు చేసుకోలేదు. మండల పరిధిలోని పెద్దబొమ్మలాపురం గండి చెరువు ప్రాంతంలో ఓ రైతుకు సంబంధించిన ఎద్దును పులి హతమార్చింది. ఇలా వరుస ఘటనలు ఆయా ప్రాంతాల్లోని రైతుల మనోధైర్యాన్ని దెబ్బ తీస్తున్నాయి. అటవీ ప్రాంతంలో నీటి లభ్యత సరిగా లేకపోవడంతో ఇవి జనవాసాలకు వస్తున్నాయని, ప్రజలపై, మూగజీవాలపై దాడులు చేస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు.

**అభయారణ్యంలో 73 పులులు**

**విఘ్నేష్ అప్పావ్, ఫీల్డ్ డైరెక్టర్, మార్కాపురం**



నల్లమలలో పులుల సంచారం పెరిగింది. నాగార్జున సాగర్-శ్రీశైలం పులుల అభయారణ్యంలో ప్రస్తుతం 73 వరకు పెద్దపులులు సంచరిస్తున్నాయి. అర్ధవీడు, కొలుకుల పరిసర ప్రాంతాల్లో ఎప్పటి నుంచో పులుల సంచారం ఉంది. నీటి కోసం పెద్దపులులు చెరువులు, కుంటల వద్దకు రావటం సహజంగానే వస్తున్నాయి. మార్కాపురం డివిజన్ పరిధిలో మార్కాపురం, యర్రగొండపాలెం, పెద్దదోర్నాల, కొర్రపోలు, నెక్కంటి, గంజివారిపల్లి, విజయపురి సౌత్ రేంజ్‌లు ఉన్నాయి. ఆయా రేంజ్‌ల పరిధిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు సుమారు 400 సాసర్ పిట్లను ఏర్పాటు చేశాం. రేంజ్‌ల వారీగా పులుల సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి నీటి నిల్వలను పెంచేందుకు కృషి చేస్తున్నాం.

## అదాని అక్రమ వ్యాపారం మోదీ కనుసన్నలలో..

### స్వతంత్ర భారతదేశంలోనే అతి పెద్ద కుంభకోణం ప్రధాని మోదీ తక్షణమే రాజీనామా చేయాలి

### ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ వి.సుదర్శన్



**ప్రజాశక్తి-మార్కాపురం రూరల్**

దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కనుసనులలో అదాని అక్రమ వ్యాపారం నడిచిందని, అందువలన లక్షల కోట్ల రూపాయలకు అధిపతిగా చెప్పుకున్న ఆదాని వ్యవహారం గుట్టు రట్టవడం ద్వారా ఇది దేశ చరిత్రలోనే అతి పెద్ద కుంభకోణంగా ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ వి.సుదర్శన్ పేర్కొన్నారు. గుజరాత్ రాష్ట్రానికి పరిమితమైన అదాని వ్యాపారం బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అతికొద్ది కాలంలోనే వేల, లక్షల కోట్ల రూపాయలకు ఎగువకి చేరి ప్రపంచంలోనే రెండో స్థానాన్ని ఏ విధంగా ఆక్రమిస్తారని ఆయన విమర్శించారు. దేశాలలో షెల్ కంపెనీలను ఏర్పాటు చేసి వాటికి తన కుటుంబ సభ్యులనే అధిపతులుగా చేసుకొని లేని షేర్లను పెంచుకుంటూ పోయి దేశంలోని ఎల్ఐసి, ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచి లక్షల కోట్ల రూపాయలు తీసుకొని తమ అక్రమ వ్యాపారాన్ని విస్తరించిన అదానికి మోడీ అండదండలే కారణమని ఆయన విమర్శించారు. హిండేన్ బర్గ్ నివేదిక వాస్తవం కాకపోతే, అదాని గ్రూపు తప్పు చేయకపోతే కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనం వహించిందని, ప్రధాని మోదీ సంయుక్త పార్లమెంటరీ సంఘం (జెపిసి) ఏర్పాటుకు ఎందుకు పారిపోతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. స్వతంత్ర భారతదేశంలోనే ఇదొక పెద్ద కుంభకోణమని, కోట్ల మంది భారత మదుపరులు లక్షల కోట్ల రూపాయలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని అదాని అక్రమ వ్యాపారం వెనుక మోది ఉన్నారు కాబట్టే ఇంత పెద్ద కుంభకోణం జరిగిందని, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 2014లో రూ.37,000 కోట్లు ఉన్న అదాని సంపద 2018లో 59,000 కోట్లకు, 2020లో రెండున్నర లక్షల కోట్లకు చేరి 2022లో 13 లక్షల కోట్లకు ఏ విధంగా చేరిందో అదాని - మోదీల సంబంధం భారతదేశ ప్రజలందరికీ తెలుసని ఆయన ఎద్దేవా చేశారు. బిజెపి అధికారంలో లేని రాష్ట్రాలపై ప్రతిపక్షాలపై ప్రస్తుతం దేశంలో ఏం జరుగుతుందో అందరికీ తెలుసని సిబిఐ, సెబి, ఈడి, మోడీ చేసే పనులను చూస్తున్నారని, స్వతంత్ర భారతదేశంలోనే ఇంత పెద్ద కుంభకోణం జరిగితే ఈ సంస్థలు ఎందుకు పనిచేయడం లేదని, ప్రధాని మోడీ ఎందుకు మౌనం వహించారని ప్రశ్నించారు. అదాని అక్రమ వ్యాపారం వెనుక కేంద్ర ప్రభుత్వం ఉండడం వల్లనే ఇంత పెద్ద కుంభకోణం జరిగిందని, ఈ నల్లదనం బిజెపి ప్రభుత్వానికి ప్రతిపక్ష రాష్ట్రాలను కూల్చడానికి ఎమ్మెల్యేలను కొనడానికి కచ్చితంగా ఉపయోగపడి ఉంటుందని ఆయన ఎద్దేవా చేశారు.



బాధితులకు ఫోను అందిస్తున్న కంట్రోలర్ బాబు

## పోగొట్టుకున్న ఫోను బాధితులకు అప్పగింత

**ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్**

ప్రయాణికురాలు పోగొట్టుకున్న సెల్ ఫోనును ఎంతో ప్రయాసలకోర్చి బాధితురాలికి అందించిన ఘటన ఇంకొల్లులో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చిన్నగంజాం మండలం సంతరావూరుకు చెందిన కె పద్మజ తన రూ.25 వేల విలువైన ఫోనును సీటులో పెట్టుకున్నారు. పద్మజ కాయలు తీసుకునేందుకు కిందకు దిగింది. పిల్లలకు చెప్పి ఫోను సీటులో ఉంచి కిందకు దిగింది. పద్మజ రాకపోవటంతో బస్సు కదిలే సమయంలో తల్లి రాలేదని ఫోను బస్సులోనే మర్చిపోయి పిల్లలు కిందకు దిగారు. బస్సు ఒంగోలు వైపు వెళ్లిపోయింది. పద్మజ కాయలు తీసుకొని వచ్చేసరికి బస్సు లేదు. సెల్ ఫోను బస్సులోనే ఉండిపోయిందని పిల్లలు చెప్పటం తో కంట్రోలర్ షేక్ బాబుకు వివరం చెప్పారు. వెంటనే స్పందించిన బాబు బస్సు డ్రైవర్‌ను సంప్రదించి ఫోనును ఎదురు వచ్చే బస్సులో ఇంకొల్లుకు పంపించారు. కంట్రోలర్‌కు బస్సు డ్రైవర్ సెల్ ఫోను తెచ్చి ఇచ్చారు. కంట్రోలర్ బాబు పద్మజకు ఫోను అందించారు. దీంతో బాధితురాలు కంట్రోలర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కంట్రోలర్ చేసిన మంచి పనిని పలువురు ప్రయాణికులు అభినందించారు.

# సుబ్బారావు మృతి తీరని లోటు

## ఎఎంసి మాజీ ఛైర్మన్‌కు పలువురి నివాళి

**ప్రజాశక్తి-పర్చూరు**

పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లింగిశెట్టి సుబ్బారావు(74) మృతి చెందారు. కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురి కావటంతో నర్సరావుపేటలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. సుబ్బారావుకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. అమెరికాలో ఇద్దరు కుమారులు స్థిరపడ్డారు. సుబ్బారావు మరణ వార్త తెలుసుకొని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, సహకార శాఖ, మార్కెటింగ్ శాఖ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. సుబ్బారావుకు బత్తులకు ఉన్న స్నేహ బంధాన్ని గుర్తు చేసుకున్నారు. పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ సుబ్బారావు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. వీరి వెంట పర్చూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పోలూరి శివారెడ్డి, కృష్ణంశెట్టి రమేష్‌బాబు, ఆదిపుడి సొసైటీ అధ్యక్షులు యర్రం లక్ష్మారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు కాలేషా, కొల్లా శ్రీహరి, ఉప సర్పంచ్ గాదె సురేష్, మండల కన్వీనర్ కఠారి అప్పారావు, వై హరిప్రసాద్, లంకా శివ, దాసరి వెంకట్రావు, మధు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి



నివాళులర్పిస్తున్న ఆమంచి కృష్ణమోహన్

**ఎమ్మెల్యే ఏలూరి సంతాపం**

ఎఎంసి మాజీ ఛైర్మన్ లింగిశెట్టి సుబ్బారావు మృతి పట్ల పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు: మంత్రి

**ప్రజాశక్తి-బాపట్ల రూరల్ (అమృతలూరు)**

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. ఆదివారం అమృతలూరు మండలం ఇంటూరు గ్రామంలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ఏపీ దేశంలోనే నెంబర్‌వన్‌గా ఉందని అన్నారు. అర్హత ఉండీ పథకాలు అందకపోతే తమకు చెప్పాలని ప్రజలను కోరారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తొలుత మంత్రికి ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాపర్ల నరేంద్ర, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి వీరభద్ర శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ ఓలేటి శివాజీ, సర్పంచ్ మొద్దు జీవమణి, ఎంపీటీసీ-1 తమ్మ వెంకట్ రెడ్డి, ఎంపిటిసి-2 కే ఆనంద్ కుమారి, మాజీ సర్పంచ్ బట్టు మోషే, రాష్ట్ర లీగల్ సెల్ సెక్రెటరీ గుమ్మడి రవిరాజ్, మాజీ సర్పంచ్ కంభం శామ్యూల్, సొసైటీ ప్రెసిడెంట్ కాజా శంకర్ రెడ్డి, దంతు కృష్ణారెడ్డి, భీమవరపు సాంబిరెడ్డి, దుండి రాఘవరెడ్డి, అవుతు ముత్తారెడ్డి, ఆర్ మోహన్‌రెడ్డి అమ్మిరి రత్నాకర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



క్షతగాత్రులను 108 వాహనంలోకి ఎక్కిస్తున్న దృశ్యం

### గుర్తు తెలియని వాహనం ఢీకొని..

## పాస్టర్ దంపతులకు గాయాలు

**ప్రజాశక్తి-మద్దిపాడు**

ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడు ఫ్లైఓవర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని పాస్టర్ దంపతులు గాయాలపాలయ్యారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలు కేశవరాజుకుంటకు చెందిన పాస్టర్ కావూరి ఎలీషా, శారాదేవి దంపతులు కేశవరాజుకుంటతో పాటు మద్దిపాడు మండలం గార్లపాడులో చర్చిలను నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం గార్లపాడులో పరిచర్య నిమిత్తం పాస్టర్ దంపతులు ఒంగోలు నుంచి మోటారు బైకుపై బయలుదేరారు.. ఒంగోలు-గుంటూరు హైవే మీద ఏడుగుండ్లపాడు ఫ్లైఓవర్ దాటాక వెనుక నుంచి వేగంగా వస్తున్న గుర్తుతెలియని కారు వీరి వాహనాన్ని ఢీకొట్టి వెళ్ళిపోయింది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఎలీషాకు కాళ్లకు, చేతులకు గాయాలు కాగా శారాదేవికి కనిపించని దెబ్బలు తగిలాయి. సుమారు పది మీటర్ల మేర రోడ్డుపై ఈడ్చుకుపోవడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు 108 వాహనానికి సమాచారమివ్వడంతో వారు క్షతగాత్రులను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

# వధూవరులకు ఎమ్మెల్యే గొట్టిపాటి ఆశీర్వాదం

**ప్రజాశక్తి-అద్దంకి**

అద్దంకి మండలం రామాయపాలెం గ్రామ వాసి విక్రం నరేంద్ర శ్రీమతి విజయలక్ష్మి దంపతుల కుమారుని వివాహం ఈ నెల 10వ తేదీన జరుగగా ఈరోజు రామాయపాలెంలోని వారి ఇంట జరిగిన సత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవ కార్యక్రమానికి అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. నూతన వధూవరులు సత్యకిరణ్, వెంకట నాగలక్ష్మి ప్రసన్నలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అద్దంకి మండలం తిమ్మాయపాలెం గ్రామంలో తొట్టెంపూడి సౌజన్య ఇటీవల మృతిచెందగా ఆదివారం వారి నివాసానికి వెళ్లి సౌజన్య భర్త రామచంద్రయ్యను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. తిమ్మాయిపాలెం గ్రామంలోనే క్రిష్ణ ఆంజనేయులు సోదరి అడుసుమల్లి రంగమ్మ లివర్ సమస్యతో బాధపడుతుండటంతో వారిని పరామర్శించి ఆరోగ్య విషయమై వాకబు చేశారు. అద్దంకి పట్టణంలోని 6వ వార్డు వాస్తవ్యులు మక్కెన హనుమంతరావు(చిన్న) శ్రీమతి శైలజ దంపతుల కుమారుని వివాహం నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కళ్యాణ మండపంలో జరుగగా ఈ వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులు లోకేష్, మానస వీణ'లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కొరిశపాడు మండలం రావినూతల గ్రామంలో కారుసాల నాగేశ్వరరావు (రిటైర్డ్ డిజిఎం, బిఎస్ఎన్ఎల్) 5వ వర్ధంతి సందర్భంగా హాజరై వారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి సేవలను కొనియాడారు. కొరిశపాడు మండలం దైవాలరావూరు గ్రామ వాస్తవ్యులు ఆళ్ళ శ్రీనివాస్ రజనీ కుమారి దంపతుల కుమారుల పంచల వేడుక ఒంగోలులోని కెబి ఫంక్షన్ హాల్‌లో జరుగగా ఈ వేడుకకు హాజరై చిన్నారులు పార్థశ్రీవాత్సవ, హేమచంద్ర లక్ష్మీ నారాయణ'లకు ఆశీస్సులు తెలిపారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలో పుత్రంశెట్టి చిరంజీవి లివర్ వ్యాధి బారినపడి మృతి చెందగా వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అదే విధంగా మేదరమెట్ల గ్రామానికే చెందిన కేశవరపు చిన్న గురువులు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



వివాహ వేడుకలో పాల్గొన్న శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

## కారు ఢీకొని తండ్రీ కొడుకుల మృతి

**ప్రజాశక్తి-జరుగుమల్లి**

మండలంలోని పాలేరు నది పై ఓవరు బ్రిడ్జి వద్ద ఒంగోలు వెళుతున్న మోటారు సైకిల్‌ను వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. ఎపి 29 సిడి 1629 నంబరు గల మోటారు సైకిల్ ఒంగోలు వైపు వెళుతోంది. దీని వెనుక ఎపి 39 ఎన్‌కె 9089 నంబరు గల కారు అదుపు తప్పి వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న తండ్రీ కుమారులు సంఘటనా స్థలంలోనే చనిపోయారు. వీరు జరుగుమల్లి మండలం కె బిట్రగుంట గ్రామానికి చెందిన కె ఆనందరావు, ఆయన కుమారుడు ఏసుగా తెలుస్తోంది. జరుగుమల్లి ఎస్ఐ వెంకటేశ్వరరావు, టంగుటూరు ఎస్ఐ ఖాదర్‌బాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


## పని చేయటానికి వచ్చిన కూలి మృతి

**ప్రజాశక్తి-కొండపి**



మృతిచెందిన కోటేశ్వరరావు

కొండపిలో పనిచేయటానికి పక్క మండలం నుంచి వచ్చిన కూలీ మృతి చెందిన సంఘటన కొండపిలోని భారత్ పెట్రోల్ బంక్ వెనుక పొలంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. టంగుటూరు మండలం కొణిజేడు గ్రామానికి చెందిన కొంతమంది కూలీలు ప్రతి రోజూ ట్రాక్టర్‌లో సూబాబుల్ కర్ర కొట్టడానికి కొండపికి వస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ఆదివారం నాడు కూడా సుబాబుల్ కర్ర కొట్టడానికి పొలంలోకి వచ్చాము అని లగ్గాల కోటేశ్వరరావు(55) అనే అతను తన భార్య గంగమ్మతో కలిసి సుబాబుల్ కర్ర కొడుతుండగా పిట్సు కనపడింది. వెంటనే అక్క పనిచేస్తున్నవారు ట్రాక్టర్‌లో కొండపి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని రావడం జరిగింది. డాక్టర్ వచ్చి పరిశీలించే సమయానికి కోటేశ్వరరావు మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. మృతదేహాన్ని ఆసుపత్రి సిబ్బంది కుటుంబ సభ్యులకు అప్పగించిన వెంటనే తన స్వగ్రామం అయిన కొణిజేడుకు తీసుకొని వెళ్లిపోయారు.



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

## భట్టిప్రోలులో హిందీ పరీక్షలు

**ప్రజాశక్తి-భట్టిప్రోలు:** మండల కేంద్రం భట్టిప్రోలు టిఎమ్ రావు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న హిందీ ప్రచార సభ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. భట్టిప్రోలు, కొల్లూరు, వేమూరు, చెరుకుపల్లి మండలాల పరిధిలోని విద్యార్థులు పాల్గొన్నారు. 325 పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 313 మంది పాల్గొన్నట్లు పాఠశాల హెచ్ఎం సి రామకోటేశ్వరరావు చెప్పారు. ప్రవీణ, ఉత్తరార్థ, పూర్వ ఉత్తరార్ధలో ఈ పరీక్షలు జరిగాయన్నారు. అలాగే శనివారం ప్రాథమిక, మాధ్యమిక వంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

# ప్రజల హక్కులను హరిస్తున్న వైసిపి ప్రభుత్వం

పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ● పలువురు యువకులు టిడిపిలో చేరిక

**ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్**

దుల్హన్ పథకాన్ని నిలిపివేసి ముస్లిం మైనార్టీలను మోసం చేసిన ఘనత జగన్ రెడ్డికే దక్కుతుందని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విమర్శించారు. ఇంకొల్లు మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బాబర్‌బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముస్లిం మైనారిటీల ఆత్మీయ సభకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ముస్లిం మైనారిటీల వివాహాల కోసం టిడిపి ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.50 వేలు ఇవ్వగా జగన్‌రెడ్డి రూపాయి కూడా ఇవ్వట్లేదన్నారు. ఎన్నికల సమయంలో దుల్హన్ పథకం లక్ష రూపాయలు ఇస్తానని చెప్పి పూర్తిగా నిలిపివేసి ముస్లింల ఆర్థిక ఇబ్బందులు గురి చేస్తున్నాడని మండిపడ్డారు. వాహన మిత్ర పేరుతో డబ్బులు ఇస్తూ మరో పక్క అధికారులతో చలానాల పేరుతో ఇచ్చిన సొమ్మును లాగేసుకుంటున్నారని విమర్శించారు. ముస్లిం మైనారిటీలకు రాజకీయంగా ఆర్థికంగా సామాజిక రంగాలలో అవకాశాలు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావుదేనన్నారు. ముస్లింల చిరకాల వాంఛ హజ్‌యాత్రకు తెలుగుదేశం ప్రభుత్వం రూపకల్పన చేసిందని అన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం ప్రజలకు కూడా రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత ముస్లిములపై అనునిత్యం దాడులు, దౌర్జన్యాలు, హత్యలకు పాల్పడుతున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని అన్నారు. బెదిరింపులతో ప్రజల హక్కులను కాలరాస్తూ రాజకీయంగా లొంగదీసుకునేందుకు వైసిపి నేతలు ప్రయత్నించడం సిగ్గుచేటని అన్నారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సొంత ఇంటికి రెంట్ చెల్లించాల్సిన పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని ఆరోపించారు. రోడ్లపై తిరగాలంటే పన్నులు వేసే దుస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. అభివృద్ధిని విస్మరించి అరాచకాలు దాడులు తప్ప సాధించిన ప్రగతి ఏమి లేదన్నారు. ప్రజల, ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతూ అక్రమ సంపాదన ధ్యేయంగా వైసీపీ నేతలు పనిచేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో చివరికి తోపుడుబండ్లపై పండ్లు అమ్ముకునే పేదలను సైతం పీల్చిపిప్పి చేస్తున్నారని ఇంతకంటే దౌర్భాగ్యం మరొకటి లేదని అన్నారు. తెలుగుదేశం పార్టీ యువ నేత నారా లోకేష్ పాదయాత్రలో పోలీసులు స్పీకర్లు పట్టుకెళ్తూ చిన్నపిల్లల చేష్టలు చేస్తున్నారని పాదయాత్రకు వస్తున్న జన స్పందన చూసి ప్రభుత్వంలో వణుకు మొదలైందన్నారు. జగన్ ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఇది సరికాదని అన్నారు. ఇంకొల్లు ఆటోనగర్ నిర్మాణ బాధ్యత తాను తీసుకుంటానన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం దానిని పూర్తి చేసిన ఘనత తనదేనన్నారు. ముస్లిములకు అండగా ఉంటానని, వారికి ఏ కష్టం వచ్చినా క్షణాల్లో వస్తానని పేర్కొన్నారు. ముస్లిములు అందరినీ కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత తనదేనన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ముస్లిం మైనారిటీ కార్యనిర్వాహక కార్యదర్శి అబ్దుల్ రజాక్, ఇంకొల్లు మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, పర్చూరు మండల అధ్యక్షుడు షేక్ శంషుద్దీన్, చిన్నగంజాం మండల ప్రధాన కార్యదర్శి ఆజాద్, కారంచేడు మండల ప్రధాన కార్యదర్శి ఖాసిం, మాజీ జెడ్పిటిసి సభ్యులు వీరగంధం ఆంజనేయులు, మీరా వలి, మస్తాన్, రబ్బాని, షేక్ మీరావలి గౌస్, చెన్నై మీరావలి, మహమ్మద్ అలీ, సమీర్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.


ఇంకొల్లులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

**ఏలూరి సమక్షంలో టిడిపిలో చేరిక**

ఇంకొల్లుకు చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే ఏలూరి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బషీర్, సైదా, ఖాజా, ముగ్బుల్ సాహెబ్, గఫార్, హపీ, బాసి, భాగ్యారావు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి: ఎంఇఒ

**ప్రజాశక్తి-అద్దంకి**

విద్యతో పాటు క్రీడల పట్ల ప్రతి విద్యార్థి ఆసక్తి చూపాలని మండల విద్యాశాఖాధికారి పివి రాఘవరావు విద్యార్థులకు సూచించారు. స్థానిక బంగ్లా రోడ్డులోని భాష్యం ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో భాష్యం స్కూల్స్ జోనల్ లెవల్ క్రీడాపోటీలు సింగరకొండలోని ఏటిఆర్ క్రీడా మైదానంలో శనివారం రాత్రి వరకు జరిగాయి. ఈ క్రీడా పోటీలకు ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖాధికారి పివి రాఘవరావు, అద్దంకి సిఐ ఎం రోశయ్య హాజరయ్యారు. ఉదయం జరిగిన కోకో, లాంగ్ జంప్, షాట్ పుట్, క్యారమ్స్, చెస్, షటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా భాష్యం స్కూల్ హెచ్ఎం శాస్త్రి అధ్యక్షతన జరిగిన సభలో ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యతోపాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొని రాణించాలని కోరారు. అనంతరం మూడు నాలుగు తరగతులు చదువుతున్న విద్యార్థినులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. సాయంత్రం జరిగిన కబాడీ, క్రికెట్ పోటీలను సిఐ రోశయ్య ప్రారంభించారు. అనంతరం శనివారం జరిగిన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా భాష్యం స్కూల్స్ ఇన్‌ఛార్జి శ్రీకృష్ణ గణేష్, దర్శి, మార్కాపురం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతి అందిస్తున్న సిఐ రోశయ్య

# కరెంటు బిల్లు కట్టలేదని మెసేజ్ వచ్చిందా?.. నమ్మకండి

అపరిచితుల నుంచి వచ్చే సందేశాలను నమ్మవద్దంటున్న బాపట్ల ఎస్‌పి వకుల్ జిందాల్

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

మీరు కరెంటు బిల్లు కట్టలేదని అపరిచితుల నుంచి వచ్చిన మెసేజ్ లింక్‌లను ఏ మాత్రం జాగ్రత్తలు పాటించకుండా క్లిక్ చేయడం లేదా ఆ మెసేజ్‌లో ఉండే కోడ్‌ను ఇతరులకు చెప్పడం చేస్తే, మీ ఖాతాలలో ఉన్న సొమ్ము ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ తెలిపారు. ప్రస్తుతం సైబర్ మోసాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని అన్నారు. సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించినప్పటికీ, అమాయకులు, గ్రామీణ ప్రాంత ప్రజలు, బ్యాంక్ సేవలపై అవగాహన లేని వారిని లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు ఇలాంటి వారిని ఏదోరకంగా నమ్మించి, వారు కష్టపడి సంపాదించిన డబ్బును చాలా సులభంగా దోచేస్తూ ఉంటారని తెలిపారు. చదువుకున్న వారు సైతం సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడుతున్నారని, ఒక్కసారి సైబర్ ఉచ్చులో పడి డబ్బులుపోతే తిరిగి పొందటం చాలా కష్టమని పేర్కొన్నారు. కావున జిల్లా ప్రజలందరూ విజ్ఞత కలిగి జాగ్రత్తగా ఉండాలని అన్నారు. అలాగే సైబర్ మోసగాళ్లు మీ ఇంటి కరెంటు బిల్లు చెల్లించలేదని మీ మొబైల్‌కు మెసేజ్ పంపుతారని, వెంటనే చెల్లించకపోతే ఈ రోజు రాత్రి మీ ఇంటి కరెంటు కనెక్షన్ కట్ చేస్తామని, వివరాల కోసం కస్టమర్ కేర్ ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని ఆ మెసేజ్ సారాంశం ఉంటుంది. మీరు మెసేజ్‌లోని ఫోన్ నెంబరుకు తిరిగి ఫోన్ చేసినట్లయితే సైబర్ మోసగాడు మిమ్మల్ని పరిచయం చేసుకుని 'మీ బిల్లు చెల్లింపు అప్‌డేట్ కాలేదని, వెంటనే ప్లే స్టోర్‌కు వెళ్లి లింకు డౌన్‌లోడ్ చేసుకొని రూ.10 చెల్లిస్తే అప్‌డేట్ అవుతుందని' నమ్మబలికి మీరు ప్లేస్టోర్‌కు వెళ్లి అతను చెప్పిన లింకు డౌన్‌లోడ్ చేసుకొని రూ.10 చెల్లించిన వెంటనే మీ బ్యాంకు ఖాతా నుంచి సొమ్ము డెబిట్ అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. కరెంటు బిల్లు కట్టలేదని అపరిచితుల నుంచి వచ్చిన మెసేజ్ లింక్‌లను జాగ్రత్తలు పాటించకుండా క్లిక్ చేయడం లేదా ఆ మెసేజ్‌లో ఉండే కోడ్‌ను చెప్పడం చేయకూడదని తెలిపారు.

ఒకవేళ ఇలాంటి మెసేజ్‌లు ఎవరికైనా వస్తుంటే వారు జాగ్రత్త వహించాలని, నేరుగా దగ్గరలోని విద్యుత్ కార్యాలయానికి వెళ్లి, మీరు గత నెల చెల్లించిన కరెంటు బిల్లు తాలూకా మొత్తం వారికి జమ అయ్యాయో లేదో తెలుసుకోవాలన్నారు. లేదా మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేయాలని, లేదా సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు కాల్ చేయాలని పేర్కొన్నారు.



వినియోగదారుల అవగాహన కోసం రూపొందించిన ప్రచార చిత్రం


కృష్ణమూర్తి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

## విద్యాదాత కృష్ణమూర్తి సేవలు మరువలేనివి

**ప్రజాశక్తి-బాపట్ల:** బాపట్లలో విద్యా సంస్థలకు పునాది వేసిన ప్రముఖ వైద్యులు విద్యాదాత దివంగత డాక్టర్ యార్లగడ్డ కృష్ణమూర్తి సదా చిరస్మరణీయులని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయిబాబు అన్నారు. ఆదివారం డాక్టర్ కృష్ణమూర్తి ఐదో వర్ధంతి సందర్భంగా పట్టణంలో టౌన్ హాల్లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ 1962లో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీని స్థాపించి విద్య, వైద్య రంగాలకు ఆయన విశిష్టమైన సేవలు అందించారన్నారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా రెండు దశాబ్దాల పాటు ప్రగతి పథంలో నడిపించారు. కుల మతాలకు అతీతంగా సర్వమానవాళి శ్రేయస్సుకు ఆయన పాటుపడ్డారని పేర్కొన్నారు. విద్యా దానానికి ఆయన చేసిన సేవలకు బాపట్ల ప్రాంత ప్రజలు కృష్ణమూర్తి రుణం తీర్చుకోలేనిదని అన్నారు. నేటి యువత ఆయన ఆశయాలను, ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో న్యూస్ పేపర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న దృశ్యం

## దాతల సహకారం అభినందనీయం

**ప్రజాశక్తి-బాపట్ల:** బాపట్లలో టిడిపి ఆధ్వర్యంలో ఆరంభించిన అన్న క్యాంటీన్‌కు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బాధ్యులు వేగేశన నరేంద్రవర్మ అన్నారు. ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా బాపట్లలో 105 రోజుల నుంచి దిగ్విజయంగా అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామన్నారు. తాజాగా ఆదివారం బాపట్ల మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తోట మల్లీశ్వరి నారాయణరావు మనవడు గీత్ గోకుల్ కార్తీక్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని 3 వందల మంది నిరుపేదలకు అన్నదానం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా తోట మల్లేశ్వరి కుటుంబ సభ్యులను పార్టీ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో వడ్లమూడి వెంకటేశ్వర్లు, గొలపల శ్రీనివాసరావు, ఫరీద్ మస్తాన్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


కస్తూరిబాయి దశదిన కర్మకు హాజరైన ఎమ్మెల్యే కరణం బలరాం

## కస్తూరిబాయి కుటుంబానికి పరామర్శ

**ప్రజాశక్తి-చీరాల:** చీరాల మున్సిపాలిటీ మాజీ మున్సిపల్ చైర్మన్ అందే కస్తూరిబాయి ఇటీవల మృతి చెందిన సంగీతం పాఠకులకు తెలిసిందే. అయితే ఆదివారం చీరాలలోని కస్తూరిబాయి స్వగృహం వద్ద జరిగిన దశదినకర్మకు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీ అభివృద్ధికి ఆనాడు కస్తూరిబాయి అందించిన సేవలు మరువలేనివని అన్నారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ అందె నరసింహారావు, అవ్వారు ముసలయ్య, కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, వాసిమల్ల వాసు పాల్గొన్నారు.

# బాగా చదివి పరీక్షలకు సిద్ధంకండి

## ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు కంకణాల ఆంజనేయులు

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

పదో తరగతి విద్యార్థులు బాగా చదివి పరీక్షలకు సిద్ధం కావాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక బి.ఎ.కెఆర్ డిగ్రీ కళాశాలలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రజ్ఞా వికాసం పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ అధ్యయనం పోరాటం నినాదంతో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తూనే మరోవైపు విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు బాగా చదివి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వినోద్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రజ్ఞ వికాసం పరీక్షల్లో 7,000 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. పరీక్షల పట్ల భయాన్ని పోగొట్టేందుకు ప్రజ్ఞా వికాసం పరీక్ష విద్యార్థులకు బాగా ఉపయోగపడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ ఒంగోలు నగర అధ్యక్ష కార్యదర్శులు శశాంక్, హేమంత్, నగర ఉపాధ్యక్షుడు వెంకటేష్, నాయకుడు ఏడుకొండలు, జెవివి నాయకుడు వెంకటేష్ పాల్గొన్నారు. **మార్కాపురం రూరల్:** బాగా చదవండి. పరీక్షలకు సిద్ధం కండి అనే నినాదంలో యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రజ్ఞా వికాసం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు సుమారు 800 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ నాయకులు లోకేష్, బి. శ్రీరాములు మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రజ్ఞా వికాసం పేరుతో మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు భయపడకుండా ప్రశాంతంగా పబ్లిక్ పరీక్షలు రాసేందుకు ఈ పరీక్ష ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కె. ప్రభాకర్, పి. వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ నాయకులు లోకేష్ , జొనాథన్ కార్తీక్ ,కిరణ్ , షారుక్ ,జన విజ్ఞాన వేదిక నాయకులు ఏనుగుల రవికుమార్, పి.రామాంజి , ఏనుగుల శివ పాల్గొన్నారు. **చీమకుర్తి :** యుటిఎఫ్,ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మోడల్ ప్రజ్ఞా వికాస పరీక్ష ఆదివారం నిర్వహించారు. స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో యుటిఎఫ్ మండల అధ్యక్షుడు షేక్ అక్బర్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జి. దేవరాజ్, కళాశాల ప్రిన్సిపల్ డి. రాజశేఖరరెడ్డి ప్రశ్నాపత్రాలు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులలో పరీక్షల ఎడల భయాన్ని పోగొట్టడానికి ఈ పరీక్ష ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. పరీక్షల పట్ల అవగాహన కలుగుతుందని తెలిపారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులను అభినందించారు.మొత్తం 108 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షుడు ఎస్.కె.అక్బర్, యుటిఎఫ్ మండల నాయకులు ఎన్.పి.వెంకటేశ్వర్లు,పి.వి. కోటేశ్వరరావు,ఎస్.కె. కరీముల్లా, మస్తాన్,బొడ్డు ఏడుకొండలు, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జి. దేవరాజ్, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి టి.విజయ్, ఎస్ఎఫ్ఐ మండల నాయకులుకె. హర్షన్,వి. కిషోర్,బి.జగదీష్, వినయ్,ఎన్. బ్రహ్మం,గణేష్ పాల్గొన్నారు.



ఒంగోలులో ప్రశ్నా పత్రాలు విడుదల చేస్తున్న కంకణాల ఆంజనేయులు



మార్కాపురంలో ప్రశ్నా పత్రాలు విడుదలచేస్తున్న నాయకులు



చీమకుర్తిలో ప్రశ్నా పత్రాలు విడుదల చేస్తున్న నాయకులు



పుస్తకాలు అందజేస్తున్న మారెళ్ల సుబ్బారావు

## పుస్తకాలు అందజేత

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

విద్యార్థిని ఉన్నత చదువుకు శ్రీ సూర్యశ్రీ వికలాంగుల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.17,800 విలువైన పుస్తకాలు ఆదివారం బహూకరించారు. నీట్‌లో ఖమ్మం జిల్లాకు చెందిన పూజితకు రెండు లక్షల లోపు ర్యాంకు వచ్చింది. ఎంబిబిఎస్ ఫస్టియర్ చదువుకోడానికి తండ్రి లేని పూజితకు అమ్మ ఇద్దరు చెల్లెలు ఉన్నారు. చదువుల్లో రాణిస్తున్న పూజితకు డాక్టర్ చదవటానికి సూర్యశ్రీ ట్రస్ట్ సెక్రటరీ సర్దార్ బాషా దాతలతో మాట్లాడి ప్రవాస భారతీయురాలైన శిరీష కోరాట్ల తన సంస్థ హెచ్ 20 ద్వారా రూ.17, 800 విలువైన పుస్తకాలు అందజేశారు. స్థానిక ట్రస్ట్ కార్యాలయంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మారెళ్ల సుబ్బారావు పూజితకు ఈ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డు రాకూడదన్నారు. నీట్‌లో మంచి మార్కులు సాధించి డాక్టర్ సీటు పొందిన పూజితకు ఆర్థికంగా అండగా నిలిచిన సూర్యశ్రీ ట్రస్ట్ సెక్రటరీ సర్దార్ బాషా, దాతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ల శ్రీనివాసరావు, బొడ్డపాటి వెంకట్, గొల్లపూడి రవి తదితరులు పాల్గొన్నారు

## కెవిపిఎస్ డైరీ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-సిఎస్.పురం**

సిఎస్‌పురం పోలీస్‌స్టేషన్‌లో కెవిపిఎస్ డైరీని ఎస్ఐ అనిల్‌కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి బిజె.రత్నం, సిఐటియునాయకులు బి.ఏసురత్నం, బి.జాన్సన్, బి.నిలీష్, బి.సందీప్ తదితరులు పాల్గొన్నారు.



దీపికను ఆశీర్వదిస్తున్న డాక్టర్ వెంకయ్య

## డాక్టర్ మాదాసి ఆశీర్వాదం

**ప్రజాశక్తి-కొండపి**

మండల పరిధిలోని చోడవరం గ్రామంలో వైసిపి స్టేట్ సోషల్ మీడియా మాజీ కోఆర్డినేటర్ గుంటుపల్లి పూర్ణచంద్రరావు నివాస గృహంలో గుంటుపల్లి దీపిక ఓణీల వేడుక ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పాల్గొని చిన్నారి దీపికను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బొక్కిసం సుబ్బారావు, కొండపి సొసైటీ అధ్యక్షుడు ఉపేంద్రచౌదరి, చోడవరం సర్పంచి స్వర్ణ నవీన్, దిశ కమిటీ మెంబర్ దుగ్గిరాల వెంకటేశ్వర్లు, వెంకట నర్సు, మిట్టపాలెం వైస్ సర్పంచి మండవ మాలకొండయ్య, కొండపి మాజీ సర్పంచి మురపాకుల రాజబాబు, మిట్టపాలెం మాజీ సర్పంచి మండవ కోటిలింగం, వెన్నూరు వైసిపి నాయకులు కంటు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా వేముల

**ప్రజాశక్తి-కొండపి**

వైసిపి సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా అనకర్లపూడి గ్రామానికి చెందిన వేముల మహేంద్ర చౌదరి నియమితులయ్యారు. కో-కన్వీనర్లుగా కుంచాల ప్రసాదు, రంపతోటి చినబ్రహ్మయ్య, షేక్ గుంటూరు వలి, యల్లావుల శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా మహేంద్ర చౌదరికి పలువురు అభినందనలు తెలిపారు.

---

### పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ..

## నాయకుల ఇంటింటి ప్రచారం

**ప్రజాశక్తి-కంభం రూరల్**

పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పోక్కి రెడ్డి బాబు రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ యుటిఎఫ్, జెవివి, సిఐటియు నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కంభం పట్టణంలోని ఎల్‌బిఎస్ నగర్‌లో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు డి.పిచ్చిరెడ్డి, కె.చలమారెడ్డి,కె.సునీల్, జెవివి మండల అధ్యక్షుడు వరికుంట్ల వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎన్‌వి. రమణారెడ్డి, సిఐటియు నాయకులు తోట తిరుపతిరావు, ఎం.ఎస్.బేగ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

## విద్యార్థులకు బెల్ట్ టెస్టు

**ప్రజాశక్తి -శింగరాయకొండ**

ఇంటర్నేషనల్ షావలిన్ కుంగ్‌ఫు అకాడమీ ఆధ్వర్యంలో బెల్ట్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శింగరాయకొండ ఎస్ఐ ఫిరోజా ఫాతిమా బేగం, సీనియర్ న్యాయవాది సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు విద్యార్థులకు తగిన సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల విద్యార్థులు దఢత్వంగాను మానసికంగా ఎదుగుతారని తెలిపారు. శ్రీ చైతన్య టెక్నో స్కూల్, సెయింట్ జోసెఫ్ స్కూల్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని బెల్టులు సాధించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ కుంచాల సాయి వేణును అభినందించడం జరిగింది.



మాస్టర్ వేణును అభినందిస్తున్న దృశ్యం

## పేదల పెన్నిధి తిరుపతినాయుడు

### టిడిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

**ప్రజాశక్తి-పామూరు**

పేదల పెన్నిధి ఇరిగినేని తిరుపతినాయుడు అని టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. కనిగిరి మాజీ ఎమ్మెల్యే ఇరిగినేని తిరుపతినాయుడు 6వ వర్ధంతి సందర్భంగా మోపాడు గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ తిరుపతినాయుడు కనిగిరి నియోజకవర్గ ప్రజల కోసం అహర్నిశలు పనిచేసి ప్రజల గుండెల్లో స్థిర స్థాయిగా నిలిచారన్నారు. కుటుంబ అభివృద్ధిని మరచి పేద ప్రజల అభివృద్ధి కోసం పనిచేసిన ఘనత ఇరిగినేనికే దక్కుతుందన్నారు. తిరుపతి నాయుడు ఆశయాలు కోసం టిడిపి నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇరిగినేని రవి, పారిశ్రామికవేత్త కోటపాటి జనార్దన్, మాజీ జడ్‌పిటిసి బొల్లా మాల్యాద్రి చౌదరి, టిడిపి మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌చౌదరి, మాల్యాద్రి, రామారావు, రమణయ్య, మాజీ ఎంపిపి ఆవుల నాగేశ్వరరావు, నరసింహ రావు, శ్రీనివాసరెడ్డి, ఎం. రమణయ్య, హుస్సేన్‌రావు పాల్గొన్నారు.



ఇరిగినేని విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉగ్ర

## ప్రమాదభరితంగా గుంత

### రాకపోకలకు అవస్థలు

**ప్రజాశక్తి-చీమకుర్తి**

చీమకుర్తి-గంగవరంరోడ్డులో హిందూ శ్మశానవాటిక ఎదుట బ్రిడ్జిపై పెద్ద గుంత ఏర్పడింది. బ్రిడ్జిపై ఊలు లేచిపోయి ఇనుప చువ్వలు బయట పడ్డాయి. దీంతో వాహనాల రాక పోకలకు అంతరాయం కలుగు తోంది. చీమకుర్తి-గంగవరం రోడ్డులో హిందూ శ్మశానవాటిక ఎదుట కాలువపై గత మూడేళ్ల క్రితం బ్రిడ్జి నిర్మించారు. ఈ రోడ్డుపై దర్శి, తాళ్లూరు,అద్దంకి ప్రాంతాలకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగి స్తుంటాయి.గ్రానైట్ రాళ్లను తరలించే భారీ వాహనాలు కూడా తిరుగు తుంటాయి. గత ఏడాదిగా బ్రిడ్జి మధ్యలో రహదారిపై చిన్న గుంత ఏర్పడింది. వాహనాల రాకపోకల కారణంగా గుంత పెద్దదైంది. శ్లాబ్‌లోని ఇనుప చువ్వలు కూడా బయట పడ్డాయి. ఈ రోడ్డుపై నిత్యం జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు రాకపోకలు సాగిస్తు ంటారు. అయిన ప్పటికీ ఎవరూ బ్రిడ్జి గుంతపై దృష్టి సారించ లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించిన బ్రిడ్జిపై ఏర్పడిన గుంతకు మరమ్మతులు చేపట్టి వాహనాల రాకపోకలకు అవస్థలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాద భరితంగా మారిన గుంత

# సమస్యల వలయంలో కాకుటూరువారిపాలెం

**- 22 నెలలు .. 8 మంది కార్యదర్శులు**

**- ఎంపిడిఒ తీరుపై గ్రామస్తుల ఆగ్రహం**

**ప్రజాశక్తి-టంగుటూరు**

ఆ గ్రామం సమస్యలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. క్షేత్ర స్థాయిలో గ్రామాల అభివద్ధి కోసం ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో సచివాలయాలు నిర్మించింది. పరిపాలనను ప్రజల వద్దకే తీసుకెళ్లాలన్న ప్రభుత్వ లక్ష్యం క్షేత్రస్థాయిలో కొందరు అధికారుల తీరుతో అమలుకు నోచడం లేదు. మండలంలోని కాకుటూరువారిపాలెం గ్రామం సమస్యలతో కునారిల్లుతోంది. ఒక చిన్న సమస్య సైతం ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసి పంచాయతీ పాలకవర్గం ఏర్పడిన 22 నెలల కాలంలో 8 మంది కార్యదర్శులు మారారు. దీంతో గ్రామానికి ఏ కార్యదర్శి వచ్చినా 2 లేదా 3 నెలలకు మించి పని చేయడంలేదు. ఫలితంగా గ్రామంలోని సమస్యలు పరిష్కారానికి నోచడం లేదు. గ్రామంలో విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయి. గ్రామంలో విద్యుత్ స్తంభాలు దాదాపు శిథిలావస్థకు చేరాయి. ఉన్నవి



కాకుటూరువారిపాలెం గ్రామ సచివాలయం

సక్రమంగా పనిచేయక కొత్త స్తంభాలు మంజూరు కాక ప్రజలు అంధకారంలోనే జీవనం గడుపుతున్నారు. గ్రామానికి రెగ్యులర్ కార్యదర్శి లేకపోవడంతో బర్త్, డెత్ సర్టిఫికెట్లతో పాటు ఇతర సచివాలయ సేవలు ఏమీ సకాలంలో అందడం లేదు. చిన్నపాటి సమస్యలు సైతం చిలికి చిలికి గాలి వానలా మారి వివాదాలకు దారితీస్తున్నాయి. గ్రామంలో ప్రతిపక్ష పార్టీ సర్పంచి ఉన్నారన్న అక్కసుతోనే వారిపై అధికార పార్టీ నాయకులకు, ఉన్నతాధికారులకు మండల స్థాయి అధికారులు ఫిర్యాదులు చేస్తూ వివాదాలకు గురి చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

**ఎండిపిఒ తీరుపై గ్రామస్తుల ఆగ్రహం**

కాకుటూరువారిపాలెం గ్రామానికి రెగ్యులర్ కార్యదర్శిని నియమించి సమస్యలను పరిష్కరించాల్సిన ఎంపిడిఒ అధికార పార్టీ ఏజెంట్‌గా మారి సమస్యలను మరింత పెంచుతూ వివాదాలకు కారకలవుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, పంచాయతీ పారిశుధ్య కార్మికులకు సైతం వేతనాలు సరిగా ఇవ్వకపోవడంతో గ్రామంలో అభివద్ధి పనులేమీ జరగడం లేదని చెబుతున్నారు. ఎంపిడిఒ వైఖరి వల్లే గ్రామాభివద్ధి కుంటుపడిందని, ఎంపిడిఒ తీరును నిరసిస్తూ కాకుటూరువారిపాలెం గ్రామస్తులు మండల కేంద్రంలో ఆందోళన చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

**కార్యదర్శులను పనిచేయనివ్వడం లేదు : ఎంపిడిఒ**

కాకుటూరువారిపాలెం పంచాయతీ పాలకవర్గం కార్యదర్శులను సక్రమంగా పనిచేయనివ్వడం లేదు. రెగ్యులర్ కార్యదర్శిని గ్రామానికి కేటాయించాలని జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక పంపాం. డిపిఒ నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ మండల పరిధిలోని పొందూరు కార్యదర్శి యేజర్ల పద్మను ఇన్‌ఛార్జి కార్యదర్శిగా నియమించాం.

## శివారెడ్డికి ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాశక్తి-పొన్నలూరు**

మండల పరిధిలోని కొత్తసింగరబొట్లపాలెం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు గుండాల శివారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం గురించి తెలుసుకున్న కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆదివారం శివారెడ్డి నివాస గృహానికి వెళ్లి ఆయన్ని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాఘవరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళకు రక్తదానం

**ప్రజాశక్తి-కొండపి**

మండల పరిధిలోని గోగినేనివారిపాలెం గ్రామానికి చెందిన బిరుదుల పరిశుద్ధం గత కొన్ని రోజులుగా గుండెజబ్బుతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులకు ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొని పోయే ఆర్థిక స్థోమత లేక ఒంగోలు రిమ్స్‌లో చేర్పించారు. అక్కడి వైద్యులు పరిశుద్ధంను పరీక్షించి గుండె ఆపరేషన్ చేయాలని చెప్పారు. అయితే ఆమె రక్త హీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. రక్తం సమకూర్చుకోవాలని కుటుంబ సభ్యులకు సూచించారు. దీంతో పరిశుద్ధం శ్రీహరి గ్రామస్తుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో స్పందించిన బొద్దులూరి విద్యాసాగర్ ఆదివారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌కు పలువురు అభినందలు తెలిపారు.

## బాలినేనిని కలిసిన గోపాల్‌రెడ్డి

**ప్రజాశక్తి-కనిగిరి**

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని వైసిపి కనిగిరి నియోజకవర్గ నాయకుడు మూలె గోపాల్‌రెడ్డి హైదరాబాద్‌లో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కనిగిరి నియోజకవర్గంలోని నెలకొన్న పరిస్థితుల గురించి బాలినేనికి వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి విజయానికి కృషి చేస్తానని తెలిపారు.

## చింతల చెరువును కలిసిన 'దద్దాల'

**ప్రజాశక్తి-కనిగిరి**

రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ౨ ండ్డిని హైదరాబాదులోని ఆయన స్వగృహంలో హనుమంతునిపాడు జడ్‌పిటిసి దద్దాల నారాయణ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో ఘనంగా సన్మానించాడు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు చింతం శ్రీనివాసులు, మాజీ సర్పంచి గొబ్బిళ్ల శ్రీనివాసులు, వైసిపి నాయకులు మూలె గోపాల్‌రెడ్డి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## సాదాసీదాగా మండల సమావేశం

**ప్రజాశక్తి-ముండ్లమూరు**

ఎంపిపి సుంకర సునీత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటీఫికేషన్ విడుదలై ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందుకు వివిధ శాఖలపై సమీక్షలు జరపకూడదని తెలిపారు. సర్పంచులుఎంపిటిసిలు గ్రామాల్లో రాజకీయ నాయుకుల ప్లెక్సీలు ఉంటే తొలగించాలన్నారు. మార్చి 16 తరువాత సమావేశం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి రత్నరాజు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రామాంజనేయులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

## ఈశ్వరయ్యకు నివాళి

**ప్రజాశక్తి-పెద్దారవీడు**

మండల పరిధిలోని తమ్మడపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు, సచివాలయ కన్వీనర్ పిన్నెబోయిన ఈశ్వరయ్య (38) శనివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న వైసిపి మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, జడ్‌పిటిసి యేర్వ చలమారెడ్డి, ఎంపిటిసి పెద్దకాశయ్య, తడికమల్ల బాలసుబ్బారావు, సర్పంచులు చినోడు, ఆదినారాయణ యాదవ్, వైసిపి నాయకులు, భాస్కర్, రామచంద్ర యాదవ్, వైసిపి నాయకులు, ఇతర పార్టీలకు చెందిన నాయకులు ఈశ్వరయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలిపారు. ఈకార్యక్రమంలో వైసిసి నాయకుల, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 670 మందికి వైద్యపరీక్షలు

**ప్రజాశక్తి-మార్కాపురం రూరల్**



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న కందుల

స్థానిక విశ్వశాంతి హైస్కూల్ ఆవరణంలో టిడిపి ఆధ్వర్యంలోఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. గుంటూరు శంకర్ ఆసుపత్రి సౌజన్యంతో మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నేతృత్వంలో ఈ వైద్యశిబిరం నిర్వహిం చారు. ఈ సందర్భంగా బిపి. షుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. మొత్తం 670 మంది వైద్యశిబిరానికి హాజరు కాగా అందులో 175 మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించాలని నిర్ధారిం చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాన్విత సింగ్, డాక్టర్ సంకల్ప, టిడిపి పట్టణ అధ్యక్షుడు డాక్టర్ షేక్ మౌలాలి, నాయకులు మట్టం వెంకటేశ్వర్లు, కొప్పుల శ్రీను, మొగల్ షకీర్ హుస్సేన్ బేగ్, దొడ్డ రవికుమార్, సయ్యద్ గఫార్ పాల్గొన్నారు. **కొండపి :** మండల పరిధిలోని కట్టావారిపాలెం గ్రామంలో స్వచ్ఛంద సంస్థ మన ఊరి ఆరోగ్య వికాసం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో ఒంగోలు దేవి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కృష్ణమోహన్ పాల్గొని 36 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ మధుమేహం, రక్తపోటు ఉన్న వారు ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొక్కిసం సుబ్బారావు, మానికొండ వెంకటేశ్వర్లు, వీరమోసు మస్తానరావు, దేవి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## శరవేగంగా రైల్వే లైన్ పనులు

**ప్రజాశక్తి -శింగరాయకొండ**



మూడో రైల్వే ట్రాక్స్ పనులు

రైల్వే మూడో లైన్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విజయవాడ నుంచి గూడూరు వకూ మూడో లైన్ పనులు చేపట్టారు. మూడోలైన్‌కు సంబంధించి ఇప్పటికీ అన్ని పనులను పూర్తి చేసిన రైల్వే శాఖ అధికారులు ట్రాక్ పనులు వేగవంతం చేశారు. శింగరాయ కొండ పాకల గేటు నుంచి మూడవ రైల్వే లైన్‌లో రైల్వే ట్రాక్‌ను రైలు ద్వారా ఏర్పాటు చేస్తున్నారు. రైల్వే అధికారులు పనులను వేగవంతం చేస్తున్నారు. గతంలో పనులు ఎక్కువ మంది కూలీలతో ఆలస్యం అవుతున్న నేపథ్యంలో. ఇప్పుడు మారుతున్న టెక్నాలజీలో భాగంగా రైలు ద్వారా ట్రాక్ పనులు వేగంగా నిర్వహి స్తున్నారు. ఆదివారం పది కిలోమీటర్లు పైగానే ట్రాక్ పనులను పూర్తి చేశారు. ట్రాక్ పనులను ప్రజలు వింతగా చూస్తున్నారు.

## ఎంఇఒకు సన్మానం

**ప్రజాశక్తి-పిసిపల్లి**

పిసిపల్లి ఎంఇఒ జె.ప్రసాదరావు సేవలు అభినందనీయమని యుటిఎఫ్ జిల్లా కుటుంబ సంక్షేమ సంఘం కన్వీనర్ ఎ.పోతులూరయ్య తెలిపారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎంఇఒను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పోతులూరయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ఎంఇఒ పరిష్కరించడంలో ముందుండేవారని తెలిపారు. ఉపాధ్యాయులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సమస్యను వెంటనే పరిష్కరించి ఉపాధ్యాయుల శ్రేయస్సు కోసం కృషి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎస్.యేసుబాబు, ఆర్.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు అందజేత

**ప్రజాశక్తి-మార్కాపురం రూరల్**



నిత్యావసరాలు అందజేస్తున్న కాశయ్య

స్థానిక డ్రైవర్స్ కాలనీకి చెందిన మండ్ల పకీరయ్యకు ఇటీవల పక్షవాతం ఇచ్చింది. దీంతో ఆయన మంచానికే పరిమితం అయ్యాడు. పకీరయ్య, వెంకటమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ పోషణ భారంగా మారడంతో పిల్లలు కూడా చదువు మాని ఇంటివద్దే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో వెంకటమ్మ దాతల సాయం కోరింది. స్పందించిన హోంగార్డు చెన్నుపల్లి కాశయ్య కాసుల ప్రవీణ్ కుమార్(సాఫ్ట్‌వేర్) అనే దాత ఆర్థిక సహకారంతో బియ్యం కూరగాయలు నిత్యవసర సరుకులు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా హోంగార్డు చెన్నుపల్లి కాశయ్య మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందిస్తే తాను భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పేదలకు సాయం అందించాలకునే దాతలు 9603580633 సెల్‌నంబర్‌ను సంప్రదించాలని హోంగార్డు కాశయ్య తెలిపారు.

## టిడిపి హయాంలోనే పకీరుపాలెం అభివృద్ధి

**ఎమ్మెల్యే డాక్టర్ డోలాశ్రీబాలవీరాంజనేయస్వామి**

**ప్రజాశక్తి -శింగరాయకొండ**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

మండల పరిధిలోని సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని పకీరుపాలెం టిడిపి హయాంలోని అభివద్ధి చెందినట్లు ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. పకీరు పాలెంలోని ముస్లిం యువతతో ఆదివారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దామచర్ల ఆంజనేయులు ఎమ్మెల్యే మంత్రిగా ఉన్న సమయంలో పకీరు పాలెంలో మసీదులను అభివద్ధి చేసినట్లు తెలిపారు. రూరల్ అర్బన్ పథకం ద్వారా పకీరుపాలెంలో పూర్తిస్థాయిలో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపనట్టి తెలిపారు. సాగర్ నీరు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వేల్పుల సింగయ్య, కూనపురెడ్డి వెంకట సుబ్బారావు, మించాల బ్రహ్మయ్య, పులి ప్రసాదు, ఉమ్మడిశెట్టి రామారావు, షేక్ అబ్దుల్ సుభాన్ ,సుదర్శ, ప్రసాదరావు, గాలి హరిబాబు, కల్లగుంట నరసింహ, తెలుగు యువత అధ్యక్షుడు షేక్ సనావుల్లా, షేక్ యస్ధాని తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాల అధికారి

- సొన ఆక్రమణ, అక్రమ కట్టడం
- కలెక్టరేట్ స్థాయి ఆఫీసర్ జులుం
- పట్టించుకోని స్థానిక అధికారులు

**ప్రజాశక్తి-వేటపాలెం**

ఆయనది లూప్‌లైన్ పోస్ట్. ఆయన పోస్టే కాదు కార్యకలాపాలు సైతం లూప్‌లైన్‌ను తలపిస్తున్నాయి. గుంటూరు, వైజాగ్ ప్రాంతాల్లో జిల్లా ఫైర్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లా కలెక్టరేట్‌లోని అగ్నిమాపక శాఖ విభాగం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్‌గా కొనసాగుతున్నారు. ఆయన తన ఉద్యోగాన్ని అడ్డుపెట్టుకొని స్థానికంగా ఉన్న రెవెన్యూ, పంచాయతీ అధికారులను ముప్పుతిప్పలు పెడుతున్నాడు. వివరాల్లోకి వెళితే.. వేటపాలెం మండలం, చల్లారెడ్డిపాలెం పంచాయతీ సచివాలయం-2 పరిధిలో అసిస్ట్ విశ్రాంతి భవనం ఎదురుగా నాయునిపల్లి రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్ 194లోని సబ్‌డివిజన్ 4,5లలో చిన్నసన్నకారు రైతులు మెట్ట పైర్లు వేసుకొని సాగుచేసుకొంటుండేవారు. ఆ భూములు కాలక్రమేణా కొనుగోలు, అమ్మకాల ద్వారా చేతులు మారాయి. ఈ భూముల్లో ఇప్పటికి కొంతమంది నిరుపేదలు అపరాలు సాగుచేసుకొని జీవనం గడుపుతున్నారు. ఆ భూముల్లో ఈ లూప్‌లైన్ ఉద్యోగి కలెక్టరేట్‌లో జిల్లా ఆఫీసర్‌ను అనే ధీమాతో స్థానిక అధికారులను లెక్కచేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక అధికారులు ల్యాండ్ కన్వర్షన్, ప్లాన్ అప్రూవల్స్, ఎన్‌ఓసిలు రికార్డులు గురించి మారు మాట్లాడనీయకుండా తాను చేసేది కలెక్టరేట్‌లోనే. తనకంతా తెలుసు అనడం గమనార్హం. ఈ తంతు స్థానిక అధికారులకు, ఈ లూప్‌లైన్ ఆఫీసర్‌కు నాలుగు నెలలుగా జరుగుతున్న సంభాషణ. ఈ నాలుగు నెలల్లో మాత్రం ఆయన దర్జాగా సొనను నాలుగు సెంట్లు పూడ్చి వేశారు.



మెట్ట పొలాల్లో అక్రమంగా నిర్మిస్తున్న గోడౌన్

పూడ్చిన సొన నుంచి 216 జాతీయ రహదారికి రోడ్డు నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఎలాంటి అనుమతులు లేకుండా గోడౌన్ పేరుతో తలపైకెత్తి చూసేంత అక్రమ కట్టడం నిర్మించారు. ఈ అక్రమ కట్టడానికి కనీసం విద్యుత్ కనెక్షన్ కూడా తీసుకోకుండా పంట పొలాల్లోని మీటర్ నుంచి అక్రమ విద్యుత్ వినియోగించడం చూసేవారికి ఆశ్చర్యానికి గురిచేస్తుంది. నిర్మాణం పూర్తి అయినాక అక్రమ వేరుశనగ ఫ్యాక్టరీకి సన్నాహాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇంత జరుగుతున్నా స్థానిక దిగువ శ్రేణి ఉద్యోగుల నుంచి పైస్థాయి డివిజినల్ స్థాయి ఉద్యోగుల వరకు చూస్తుండడం వెనుక గల ఆంతర్యం మాత్రం ఎవరికీ అంతుబట్టకుందనే విమర్శలు ఉన్నాయి. అయినప్పటికీ ఈ అక్రమార్కుడికి ఎలాంటి నోటీసు జారీ చేయకపోవడం విమర్శలకు మరింత బలం చేకూరుస్తోంది. ఇప్పటికైనా అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని, ఆక్రమించుకొన్న సొనను స్వాధీనం చేసుకొని ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా చూడాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

## కుట్టు మిషన్లు అందజేసిన వాకర్స్ అసోసియేషన్

**ప్రజాశక్తి-చీరాల**

తమ సేవా కార్యక్రమాలలో భాగంగా వాకర్స్ అసోసియేషన్ ఇద్దరు బాలికలకు కుట్టు మిషన్లను అందజేసింది. ఆదివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్ఆర్అండ్‌పిఎం హైస్కూల్ గ్రౌండ్‌లో వాకింగ్ అసోసియేషన్ సభ్యుడు దోగుపర్తి వెంకట సురేష్ పెళ్లిరోజు సందర్భంగా రూ.14 వేల విలువ గల రెండు కుట్టు మిషన్లను ఆయన సొంత నిధులతో నిరుపేద బాలికలయిన తిరువీధుల దివ్య భారతి, నారాయణం సౌమ్యలకు ఉచిత టైలరింగ్ కోర్స్‌లో శిక్షణ ఇప్పించి మిషన్లు అందజేశారు. కార్యక్రమంలో దోగుపర్తి వెంకట సురేష్, అమరా వీరాంజనేయులు, పోలుదాసు రామకృష్ణ, ఉమామహేశ్వరరావు, శ్రీరాం రమేష్, చారుగుళ్ల ప్రసాద్, డేగల తిరుపతిరావు, చింతా రమేష్, వంగర పూర్ణచంద్రరావు, దరియా సాహెబ్, దండా నారాయణరావు, వాకర్స్ పాల్గొన్నారు.

## సిపిఎస్ రద్దు కోసం పోరాటం: యుటిఎఫ్

**ప్రజాశక్తి-పిసిపల్లి**

సిపిఎస్ అంతం కోసం యుటిఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందని యుటిఎఫ్ జిల్లా నాయకుడు ఎ పోతులూరయ్య తెలిపారు. ఎస్ ఏసుబాబు అధ్యక్షతన పిసిపల్లి మండల యుటిఎఫ్ శాఖ మహాసభ స్థానిక జడ్‌పి హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోతులూరయ్య మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించేలా, ఉపాధ్యాయ సమస్యల కోసం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. యుటిఎఫ్ పోరాటాలతోనే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం అయ్యాయన్నారు. జెవివి జిల్లా నాయకులు వి మాలకొండారెడ్డి మాట్లాడుతూ అప్రెంటీస్ వ్యవస్థను రద్దు చేయడం వెనుక యుటిఎఫ్ అవిరళ కృషి ఉందన్నారు. ఆర్ వేణుగోపాల్, ఎస్ గోపి పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక**

యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులుగా ఎస్ యేసుబాబు, సిహెచ్ రమేష్ ఎన్నికయ్యారు. మరికొంత మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## బిసిలు ఐక్యంగా ఉండాలి: ఎమ్మెల్యే ఏలూరి

**ప్రజాశక్తి-పర్చూరు**

బిసిలంతా ఐక్యంగా ఉండి సమస్యల పట్ల స్పందించి పరిష్కారం కోసం కృషి చేయాలని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కోరారు. మండల బిసి నాయకులతో టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభకు బిసి రాష్ట్ర నాయకులు కోడూరి శేషబ్రహ్మాచారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ రానున్న కాలం పరీక్షాకాలం లాంటిదని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సైనికుల్లా పనిచేయాలని బిసిలకు పిలుపునిచ్చారు. ఎన్‌టిఆర్ బిసిలకు ఇచ్చిన హక్కులను తిరిగి సాధించుకోవాలని కోరారు. సమావేశంలో చవటవరపు జనార్ధనరావు, శివరాత్రి శ్రీనివాసరావు, అన్నవరపు శ్రీనివాసరావు, ఎ జగన్, నరేంద్ర, సింగయ్య, కె వసంతరావు, ఎం శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌ను అవమానిస్తే తీవ్ర పరిణామాలు

**ప్రజాశక్తి-పిట్టలవానిపాలెం**

ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానకరంగా మాట్లాడిన తెలంగాణకు చెందిన మత ఉన్మాది హమారా ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్, అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం సెంటర్లో హమారా ప్రసాద్ చిత్రపటాలను పట్టుకొని వ్యతిరేక నినాదాలు చేశారు. దళిత పెద్దలు, యూత్ నిరసన తెలిపారు. హమారా ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని, దేశ ద్రోహిగా కేసు నమోదు చేసి జైల్లోనే ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కె శరత్ మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌పై చంపుతానంటూ అనుచితంగా మాట్లాడిన హమారా ప్రసాద్‌ను అరెస్ట్ చేయడమే కాదు మరొకరు ఇలా మాట్లాడకుండా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన హమారా ప్రసాద్ నిరంతరం తాను చేస్తున్న చిల్లర పనులకు తోడుగా వ్యక్తిగత పాపులారిటీని పెంచుకోవడం కోసం రాజ్యాంగ నిర్మాతపైనే కండకావరమెక్కి మాట్లాడటం దేశ ప్రతిష్టకే అవమానకర మని అన్నారు. జాతీయ నాయకులను కించపరిచే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని, లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. అంబేద్కర్ యువజన సంఘం నాయకులు జె వీరస్వామి మాట్లాడుతూ.. 10మంది ప్రపంచ మేధావుల్లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అగ్రస్థానంలో ఇప్పటికీ వుండి దేశం గర్వించే స్థితిలో వుంటే ఆవారగాడు ప్రసాద్ హిందుత్వాన్ని అడ్డుపెట్టుకుని మహాజ్ఞాని అయిన అంబేద్కర్ రచనలు అర్థం చేసుకోకుండా, చదవకుండా ఇలా అనుచిత వ్యాఖ్యలను చేయడం సరికాదన్నారు. ఇలాంటి మత విద్వేషాలు రెచ్చగొట్టే వాళ్లను సమాజం నుంచి బహిష్కరించాలని అన్నారు. అంబేద్కర్ యువసేన నాయకులు కొమరబత్తిన భూషణం మాట్లాడుతూ.. గాంధీ దేశంలో మత సామరస్యం కోసం ఎంతగానో పాటుపడ్డారని, అలాంటిది మతోన్మాది గాడ్సే గాంధీజీని హత్య చేశారని అన్నారు. అదేవిధంగా హమారా ప్రసాద్ కూడా మరో మతోన్మాదిగా మారి గాడ్సే విధానాన్ని సమర్థిస్తున్నట్లు మాట్లాడడం, ప్రపంచ మేధావి, మన దేశానికి రాజ్యాంగం అందించిన గొప్ప వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దేశద్రోహం అన్నారు. ఇలాంటి వారిని ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించాలని, జీవిత ఖైదు చేసి సమాజంలో తిరగకుండా చేయాలని, ఇలాంటి వ్యవహారాలు మరొకసారి జరగకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డంవారిపాలెం, మండేవారిపాలెం అంబేద్కర్ సేవ సంఘాల యువకులు, పెద్దలు, పలికే విక్టర్ పాల్, చేబ్రోలు మరియదాస్, ఎన్ హరీష్ ఎం వంశీ, పి రుషి, చందు, ఎం రాహుల్, వి నితిన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న యువకులు



మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న సాల్మన్ రాజ్

## మృతుని కుటుంబానికి గ్రేస్ ఫౌండేషన్ వితరణ

**ప్రజాశక్తి-భట్టిప్రోలు:** మండలంలోని చింతమోటు గ్రామానికి చెందిన కొలకలూరి చంద్రమ్మ ఏకైక కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి సాల్మన్‌రాజ్ ఆదివారం చంద్రమ్మ కుటుంబానికి కొంత ఆర్థిక సాయం అందించారు. ఫౌండేషన్ చంద్రమ్మ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అలాగే కొల్లూరు మండలం తడిగిరిపడు గ్రామంలో బిల్డింగ్ పని చేస్తుండగా ప్రమాద వశాత్తు కాలుజరి పడి రెండు కాళ్లు విరిగి మంచంలో చికిత్స పొందుతున్న పిల్లి ఉదయ్ కిరణ్‌ను పరామర్శించి కొంత ఆర్థిక సాయం అందించారు. ఉదయ్ కిరణ్‌కు మెరుగైన వైద్యం ఉచితంగా తానే ఫౌండేషన్ ద్వారా చేయిస్తానని హామీనిచ్చారు. గ్రేస్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను ఆయా గ్రామస్థులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు యాన్నం సురేష్, మాణిక్యరావు, నారాయణ, ఇస్సాకు, నాని తదితరులు ఉన్నారు.

## కారు బస్సు ఢీ.. తప్పిన ప్రమాదం

**ప్రజాశక్తి-పర్చూరు:** పర్చూరు సమీపంలో పిడుగురాళ్ల రహదారిలో చిలకలూరిపేట నుంచి పర్చూరు వస్తున్న కారు, పర్చూరు నుంచి చిలకలూరిపేట వెళుతున్న బస్సు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో కారు రోడ్డు పక్కన ఉన్న కాలువలోకి దూసుకు వెళ్లింది. కారులోని యువకులు బస్సులోని ప్రయాణికులతో వాదనకు దిగారు. అనంతరం ఇరు వర్గాలు వెళ్లిపోయారు.

## దంపతులకు ఆశీర్వాదం

**ప్రజాశక్తి-దర్శి:** అద్దంకిరోడ్‌లోని శ్రీనివాస పద్మావతి కళ్యాణ మండపంలో పచ్చా సుబ్బారాయుడు కుమారుడు నాగార్జున-పల్లవి దంపతులను దర్శి మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు ఆదివారం ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దారం సుబ్బారావు, సందు రామయ్య, ఎల్ఐసి బ్రాంచి మేనేజర్లు మహదేవయ్య, కరిముల్లా, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

**మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా..**

## శ్రీశైలం వెళ్లే వాహనాలకు సడలింపు

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల**

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఈ నెల 21 వరకూ శ్రీశైలం వచ్చి పోయే వాహనాలకు నిబంధనలు సడలించినట్లు దోర్నాల అటవీ శాఖాధికారి విశ్వేశ్వరరావు ఆదివారం తెలిపారు. గతంలో శ్రీశైలం వైపు వెళ్లే వాహనాలకు అటవీ జంతువుల సౌకర్యార్థం రాత్రులందు వాహనాలు వెళ్లకుండా నిలుపుదల చేశామన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను దృష్టిలో పెట్టుకొని వాహనాల రాకపోకలకు 24 గంటల పాటు అనుమతులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రీశైలం వైపు వచ్చి పోయే భక్తులు, ప్రయాణికులు పాలిథిన్ కవర్లు, క్యారీ బ్యాగులు అటవీ ప్రాంతంలో పడవేయకూడదన్నారు. వీటి ద్వారా అటవీ జంతువులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్:** స్థానిక శ్రీవివేకానంద ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ 1983-85 విద్యాసంవత్సరాల్లో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2వ విడత ఉచితంగా హెపటైటస్ వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహించారు. 50 మందికి వ్యాక్సిన్ వేసినట్లు నిర్వహకుడు హనుమంతారెడ్డి తెలిపారు. మే 12న 3వ విడత కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సునీల్‌బాబు, తులసిబాబు, ప్రసాద్, వలి, సుబ్బరాయుడు, స్వరూప్, రామకృష్ణారెడ్డి, దుర్గా, రంగస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల అభివృద్ధికి కృషి

## ఒలింపిక్ అసోసియేషన్ ఛైర్మన్ రవికుమార్



రవికుమార్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

జిల్లాలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల అభున్నతికి కృషి చేస్తానని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ఛైర్మన్, శ్రీ హర్షిణి విద్యా సంస్థల అధినేత జి.రవికుమార్ తెలిపారు. స్థానిక శ్రీ హర్షిణి డిగ్రీ, పీజీ కళాశాల సమావేశ మందిరంలో ఒలింపిక్ అసోసియేషన్ స్పెషల్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 26 క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సభాధ్య కులుగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కర్ రావు అధ్యక్షత వహించారు. సమావేశంలో అన్ని క్రీడా సంఘాల ప్రతినిధులు ఏకగ్రీవంగా ప్రకాశం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఛైర్మన్‌గా గోరంట్ల రవి కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జి. రవి కుమార్ మాట్లాడుతూ 26 క్రీడా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు తనను ఛైర్మన్‌గా ఎన్నుకున్నందుకు కతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని విద్యా రంగంతో పాటు క్రీడా రంగాన్ని కూడా అభివద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లాలోని పేద క్రీడాకారులకు ఉపాధి. సౌకర్యం కల్పిస్తానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, జిల్లాలో క్రీడల అభివృద్ధికి శక్తివంచన లేకుండా పాటుపడతానని తెలియజేశారు. ప్రకాశం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఛైర్మన్‌గా ఎన్నికైన గోరంట్ల రవికుమార్‌ను అసోసియేషన్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డు సుబ్బారావు, డాక్టర్ ధనుంజయ రావు, ఎస్. చంద్రశేఖరరావు, పిఎల్. రాజు, సురేష్ బాబు, శేఖర్ రెడ్డి, శ్రీకాంత్, భక్తద్రవుడు, సత్యం, విజయ్ కుమార్, ఆదినారాయణ, ఆర్. అచ్చయ్య, శ్రీ హర్షిణి కళాశాల ప్రిన్సిపల్ డి.ఆంజనేయులు పాల్గొన్నారు.

# వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-దర్శి**

ఆలిండియా కాంగ్రెస్‌పార్టీ నాయకులు రాహుల్ గాంధీ జోడో యాత్ర విజయవంతమైన నేపథ్యంలో దర్శి నియోజకవర్గంలో పాదయాత్ర చేపట్టనున్నట్లు కాంగ్రెస్ పార్టీ దర్శి నియోజక వర్గ ఇన్‌ఛార్జి పుట్లూరి కొండారెడ్డి తెలిపారు. జోడో యాత్ర వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా జోడో యాత్రను విజయవంతం పూర్తి చేసినట్లు తెలిపారు. ఎఐసిసి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఈనెల 26 నుంచి మార్చి 26 వరకూ తాము పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు ఎస్. పౌలేసు, ప్రభుదాసు, కొండగురవయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# డిఇఒ బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

జిల్లా విద్యాశాఖ అధికారిగా పిల్లి రమేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రమేష్‌ను డిఇఒ కార్యాలయ సిబ్బంది, పలువురు అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి కతజ్ఞతలు తెలిపారు. అనంతరం బదిలీ అయిన డిఇఒ బి.విజయభాస్కర్ మాట్లాడుతూ తాను పనిచేసిన కాలంలో పదో తరగతి ఫలితాలు, సప్లిమెంటరీ ఫలితాలలో రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లా ప్రధమస్థానంలో ఉండడం ఆనందం కలిగించిందన్నారు. జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆలోచనలకు అనుగుణంగా బాలికా వికాసం కార్యక్రమం ద్వారా పదో తరగతి ఉత్తీర్ణులైన 11వేల మంది బాలికలను ఇంటర్మీడియట్‌లో చేరినట్లు తెలిపారు. కాఫీ విత్ కలెక్టర్ కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో ఆలోచనలను రేకెత్తింపజేసి తద్వారా పాఠశాల స్థాయి నుంచే వారికి అవసరమైన ప్రోత్సాహాన్ని కల్పించేందుకు ఎంతగానో తోడ్పడు తుందన్నారు. రాష్ట్రంలా ఎక్కడా లేని విధంగా 9,10, ఇంటర్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం, మండలానికి ముగ్గురు టీచర్లను అకడమిక్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటుచేసి ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలను అంచనావేస్తూ అవసరమైన వారికి శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. డిఇఒ పి.రమేష్ మాట్లాడుతూ అందరి సహకారంతో విద్యా రంగం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డిఇఒ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డిఇఒ రమేష్

# జిజిహెచ్‌లో ప్లాస్టిక్ సర్జరీ వైద్యసేవలు

- జనవరిలో 15 సర్జరీలు
- సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.భగవాన్ నాయక్



**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్ ,ఒంగోలుక్రైం**

ఒంగోలు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో ప్లాస్టిక్ సర్జరీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.భగవాన్ నాయక్ తెలిపారు. గత డిసెంబర్ 5న గంగయ్య అనే వ్యక్తికి దాడిలో ఎడమచేతి డిఐపిఐ(దూర అంతర్ఫ లాంజియల్ ఉమ్మడి కీలు తొలగటం) పిఐపిఐ (ప్రాక్సిమల్ ఇంటర్ ఫాంజియల్ కీళు ్) తొలగటంతో ఉంగరం వేలు, చిటికెన వేలును వంచలేకపోయాడన్నారు. ఉల్నార్ ధమని పల్స్ తెలియకపోవడం వంటి ఇబ్బందులు కలిగి ఉన్నాడన్నారు. దీంతో గంగయ్యకు ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ సంగనబోయిన స్ఫూర్తి శస్త్రచికిత్స చేసినట్లు తెలిపారు. ఫిజియోథెరపీ తర్వాత రోగి తన ఉంగరం, చిటికెన వేలును డిఐపిఐ, పిఐపిఐ వద్ద ఎడమ చేతిని వంచగలిగాడన్నారు. ఉల్నార్ ఆర్టరీ పల్సేషన్లు పొందారన్నారు. ఇప్పుడు రోగి అదే చేతితో తన సాధారణ కార్యకలాపాలు చేసుకొంటున్నట్లు తెలిపారు. సర్జరీలు విజయవంతంగా నిర్వహించిన ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ ఎస్. స్ఫూర్తి, విభాగపు అధిపతి డాక్టర్. అమతవల్లి, హాస్పిటల్ సిబ్బందిని సూపరింటెండెంట్ ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా దీపక్ అనే వ్యక్తికి గత డిసెంబర్ 8న ప్రమాదంలో కుడి కాలు తుంటి ఎముక దిగువ భాగంలో ఎముక పై భాగం లోని కండ భాగం మొత్తం లేచిపోయి ఎముక బయటకు వచ్చిందన్నారు. ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్. ఎస్. స్ఫూర్తి, మధ్యస్థ గ్యాస్ట్రోనిమియస్ కండరాల ఫ్లాప్ కవర్, స్కిన్ గ్రాఫ్టింగ్ చేశారన్నారు. సర్జరీ చేసి మామూలు అవయవం రూపం వచ్చేలా విజయవంతంగా సర్జరీ నిర్వహించినట్లు తెలిపారు. సర్జరీ విజయవంతంగా నిర్వ హించిన ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ ఎస్.స్ఫూర్తి, విభాగపు అధిపతి డాక్టర్ అమతవల్లి, హాస్పిటల్ సిబ్బందిని సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.భగవాన్ నాయక్ ప్రత్యేకంగా అభినందించారు. జనవరి నెలలో మొత్తం 15 ప్లాస్టిక్ సర్జరీలు నిర్వహించినట్లు భగవాన్ నాయక్ తెలిపారు.

# అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ప్రతి క్షణం అమూల్యమే
- వేసవిలో అగ్ని వేగంగా వ్యాప్తి చెందుతుంది
- గ్రామీణ ప్రాంతాల్లో అప్రమత్తత అవసరం
- జిల్లా అగ్నిమాపక కేంద్రం అధికారి మాధవ నాయుడు

## ముఖాముఖి



**ప్రజాశక్తి -బాపట్ల జిల్లా**

రానున్న వేసవిలో అధిక ఉష్ణోగ్రత నమోదవుతుందని వెల్లడవుతున్న నేపథ్యంలో ప్రజలు అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక కేంద్రం అధికారి సి.మాధవ నాయుడు తెలిపారు. జిల్లాలో చీరాల, అద్దంకి,రేపల్లే, బాపట్లలో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. నాలుగు అగ్నిమాపక వాహనాలు ఉన్నాయన్నారు. చీరాలలోఓ మిస్ట్‌జీప్ ఉందన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 275 అగ్నిప్రమాదాలు చోటు చేసుకోగా తమ సిబ్బంది నష్ట నివారణ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ ప్రమాదాల్లో రూ.2.66 కోట్ల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. రూ.6.67 కోట్ల ఆస్తి నష్టం జరగకుండా కాపాడినట్లు తెలిపారు. జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో 56 మంది అగ్నిమాపక సిబ్బంది, 8 మంది హోం గార్డులు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే 101కి ఫోన్ చేయాలన్నారు. జిల్లా అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యల గురించి జిల్లా అగ్నిమాపక కేంద్రం అధికారి ప్రజాశక్తి ముఖాముఖికి వివరాలు వెల్లడించారు. అవన్నీ ఆయన మాటాల్లోనే...

**ప్రతి క్షణం అమూల్యమైనదే..**

అగ్ని ప్రమాదాలు తరచూ గృహాలు,కర్మాగారాలు, కార్యాలయాల్లో సంభవిస్తుంటాయి. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ప్రతి క్షణం అమూల్యమైనదే. ప్రమాదంలో చిక్కుకున్నప్పుడు కంగారు పడటం, పరిగెత్తడం చేయకూడదు.ప్రశాంతంగా ఉండాలి. అందరిని అప్రమత్తం చేయాలి. ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు ఉన్న మార్గాన్ని ఉపయోగించాలి. భవనంలో మెట్ల మార్గాన్ని మాత్రమే వినియోగించాలి. లిఫ్టులు ఉపయోగించకూడదు. మీరు ఉన్న గది పొగలో చిక్కుకుని ఉంటే నేలపై బోర్లా పడి ప్రాకుకుంటూ బయటకు వెళ్లాలి. అగ్ని ప్రమాద సమయంలో మీరు గదిలో చిక్కుకుంటే తలుపులు, కిటికీలు పూర్తిగా మూసివేయాలి. పొగ మరియు వాయువులు లోపలికి రాకుండా అన్ని సందులు, ఖాళీలు పూర్తిగా మూసివేయాలి. అగ్ని ప్రమాదం సమయాల్లో అక్కడ నిలబడి ఉండకూడదు. ముక్కుకు, నోటికి తడిగుడ్డ కట్టుకుని నేలపై ప్రాకుతూ బయటకు వెళ్ళాలి. కాలుతున్న ఇంటిలోకి ఏ పరిస్థితి తోనూ వెళ్ళకూడదు. అగ్ని ప్రమాద సమయంలో తప్పించుకునే మార్గాలైన మెట్లు, వరండాలు, లాబీల్లో అడ్డుగా సామగ్రి పెట్టకూడదు.మీ విలువైన వస్తువులు, సామగ్రి కోసం ఆగకూడదు. విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలి.

**వేసవిలో అగ్ని వేగంగా వ్యాప్తి చెందుతుంది**

చిన్న నిప్పు క్షణాల్లో అదుపు తప్పి చుట్టూ వ్యాప్తి చెంది అతి పెద్ద అగ్ని ప్రమాదంగా మారుతుంది .క్షణాల్లో మంటలు ఓ ఇంటిని చుట్టుముట్టుతాయి. ఇలాంటి సందర్భాల్లో మంటల నుంచి బయట పడేందుకు చాలా తక్కువ సమయం ఉంటుంది.అగ్ని వల్ల వచ్చే వేడి మనుషుల ప్రాణాలను హరిస్తుంది .ఇలాంటి సందర్భాల్లో ఇంటిలో ఉష్ణోగ్రత నేలపైన 100 డిగ్రీల సెల్సియస్ ఉంటే ఆ ఇంటి ఉపరితలంపై సమతులంగా 600 డిగ్రీల సెల్సియస్ ఉంటుంది. తీవ్రమైన వేడి గాలి పీల్చడం వల్ల మన ఊపిరితిత్తులు దహించ బడతాయి. కేవలం 5 నిమిషాలలో ఓ గదిలోని అగ్ని అక్కడి సామగ్రినంతటిని మండించే స్థాయికి చేరుతుంది.

**పొగ, విషవాయువులు ప్రాణాంతకమైనవి**

అగ్ని ప్రమాదం ద్వారా వచ్చే మంటలు వేడిని, పొగ మరియు విషవాయువులను జనింపచేస్తాయి. ఈ పొగ విష వాయువులు వేడి కంటే ముందు చాలా వేగంగా వ్యాపించి ప్రాణాలు తీస్తాయి. కొద్దిగా పొగ విషవాయువులను పీల్చుకున్నా కూడా మైకం కమ్ముతుంది. స్పృహ తప్పేలా చేస్తుంది. అందువలన అగ్ని ప్రమాదం సమయంలో అప్రమత్తంగా ఉండాలి.

**గ్రామీణ ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలి**

గ్రామీణ ప్రాంతాల్లో గుడిసెలు, గడ్డివాములు, తాటాకు పందిళ్ళ మొదలగు వాటి దగ్గరలో ఎట్టి పరిస్థితి లోనూ టపాసులు కాల్చరాదు.ఎండు గడ్డిని ట్రాక్టర్లు, లారీలు,ఎడ్ల బండ్లపై తెచ్చే సందర్భాల్లో తక్కువ ఎత్తులోనే గడ్డి వేసుకుని తరలించాలి.లేదంటే దారిలో విద్యుత్ వైర్లు తగిలి షార్ట్ సర్క్యూట్ అయి గడ్డితో పాటు వాహనం కూడా కాలిపోయే ప్రమాదం ఉంది. విద్యుత్ తీగలకు దగ్గరలో వాటి కింద గడ్డి వాములు వేయకూడదు. గడ్డి వాములు నివాసాలకు దూరంగా ఉండాలి. గడ్డి వాములకు దగ్గరలో అద్దం ముక్కలు ఉండకుండా చూసుకోవాలి. ఎలక్ట్రికల్ విడి వైర్లను సాకెట్లలో ఉంచకూడదు. ఖచ్చితంగా ప్లగ్‌లు ఉపయోగించాలి.గుడిసెల్లో ఎలక్ట్రికల్ వైర్ల జాయింట్లు ఉండకూడదు. ఓప్లగ్ లో ఎక్కువ కనెక్షన్లు ఇవ్వకూడదు. గుడిసెకు మరో గుడిసెకు మధ్య కనీస దూరం ఉండేలా చూడాలి. వంట పొయ్యిలకు దగ్గరగా వంట చెరుకు ఉంచకూడదు. వంట పొయ్యిని ఉపయోగించాక నుసి బొగ్గుని పూర్తిగా ఆర్పకుండా చెత్త కుప్పలో పారవెయ్య కూడదు.దీనివల్ల తిరిగి మంటలు ఏర్పడి అగ్ని ప్రమాదాలు జరుగుతాయి.అగ్ని ప్రమాద సమాచారాన్ని అగ్నిమాపక శాఖకు చెప్పే సమయంలో చిరునామా అర్థం అయ్యేలా చెప్పాలి.